- aruhi group
www.mahaaprabha.com

నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

శనివారం
5-09-2026

సంపుటి : 01 సంచిక : 165 పేజీలు : 08 వెల : ₹5/-

తెలంగాణ , ఆంధ్రప్రదేశ్.



Mr. NAKKA RAJU
Chairman of Mahaaprabha

Published From RANGAREDDY TELANGANA.RNI NO : TGTEL/26/A0738 VOLUME 01 ISSUE165 NAMASTEY MAHAAPRABHA

ఎల్‌నినో ఉగ్రరూపం..



03

- వచ్చే ఏడాది వాతావరణం భయానకం
- 2027లో తీవ్ర వాతావరణ పరిస్థితులకు అవకాశం
- ఎల్‌నినో బలపడుతోందని ఐరాస హెచ్చరిక
- 2027 ఫిబ్రవరి వరకు కొనసాగనున్న ఎల్‌నినో
- పసిఫిక్ సముద్రంలో పెరుగుతున్న నీటి ఉష్ణోగ్రతలు
- కరువులు, వరదలు, తుఫాన్ల ముప్పు
- పలు ప్రాంతాల్లో అడవుల్లో కార్చిచ్చుకు అవకాశం
- 2027లో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలకు ఛాన్స్
- వాతావరణ మార్పులతో మరింత పెరగనున్న ముప్పు

ఇస్రో జీఎస్‌ఎల్‌వీ-ఎఫ్17 ప్రయోగం సక్సెస్



03

- నింగిలోకి దూసుకెళ్లిన నాటీ బాయ్..
- 2,367 కిలోల ఈఓఎస్-05 ఉపగ్రహం కక్ష్యలోకి
- రక్షణ, వ్యవసాయం, విపత్తుల నిర్వహణకు కీలకం
- సబ్-జీటీఓలోకి కచ్చితత్వంతో ఉపగ్రహ ప్రవేశం
- అత్యాధునిక ఇమేజింగ్ సామర్థ్యాలతో ఈఓఎస్-05
- స్వదేశీ క్రయోజెనిక్ ఇంజిన్ కీలక పాత్ర
- భూ పరిశీలన సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయనున్న ఉపగ్రహం
- వర్షంలోనూ ప్రయోగాన్ని వీక్షించిన 1,500 మంది సందర్శకులు



రేపు బీఆర్ఎస్ఎల్పీ సమావేశం

- ఎర్రవెల్లిలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఉమ్మడి భేటీ
- కేసీఆర్ అధ్యక్షతన సమావేశం
- అసెంబ్లీ, మండలి వ్యూహంపై చర్చ
- కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై చర్చ
- హామీల అమలు, ప్రభుత్వ వైఫల్యాలపై సమీక్ష
- కృష్ణా, గోదావరి జలాల అంశంపై చర్చ
- ఏపీ జలదోపిడీపై అనుసరించాల్సిన వ్యూహంపై చర్చ
- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కేసీఆర్ దిశానిర్దేశం

హైదరాబాద్ సెప్టెంబర్ 4 మహాప్రభ

సోమవారం నుంచి అసెంబ్లీ, శాసనమండలి సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో బీఆర్ఎస్ఎల్పీ సమావేశం ఆదివారం నిర్వహించాలని బీఆర్ఎస్ పార్టీ అధినేత కె చంద్రశేఖర్‌రావు (కేసీఆర్) నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసంలో మధ్యాహ్నం ఒంటిగంటకు భోజనం అనంతరం రెండు గంటలకు పార్టీ అధినేత కేసీఆర్ అధ్యక్షతన పార్టీ శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులతో కూడిన సంయుక్త

-మిగతా 3 లో

నాణ్యతలో రాజీ వద్దు

అభివృద్ధి పనుల్లో వేగం పెరగాలి

- నారాయణపేట, వికారాబాద్ జిల్లాల్లో సీఎం పర్యటన
- మద్దూరులో పలు అభివృద్ధి పనుల పరిశీలన
- ప్రభుత్వ డిగ్రీ కళాశాల పనులు మార్చిలోగా పూర్తి చేయాలి
- గురుకుల పాఠశాల పనుల్లో జాప్యం చేయొద్దు
- నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి
- లోపాలుంటే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరిక
- పనులు వేగంగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలి
- అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలు

/నారాయణపేట ప్రతినిధి/మద్దూరు: సెప్టెంబర్ 4 మహాప్రభ మద్దూరు మండల కేంద్రంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నాణ్యతలో లోపాలు తలెత్తితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శుక్రవారం మద్దూరులో పలు అభివృద్ధి పనులను సీఎం పరిశీలించారు. మద్దూరుకు చేరుకున్న ముఖ్యమంత్రికి జిల్లా కలెక్టర్ ప్రియాంక హెలిప్యాడ్ వద్ద పూలగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనులను సీఎం పరిశీలించారు.



-మిగతా 3 లో



03

కాశ్మీర్‌లో ఎన్‌కౌంటర్..

- ఉగ్రవాది హతం
- బుద్గామ్‌లో భద్రతా బలగాల సంయుక్త ఆపరేషన్
- అఫ్తార్ గలీ అటవీ ప్రాంతంలో ఎదురుకాల్పులు
- ఓ ఉగ్రవాది హతం.. ఏకే రైఫిల్ స్వాధీనం
- సైన్యం, పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సంయుక్త గాలింపు
- కచ్చితమైన నిఘా సమాచారంతో ఆపరేషన్
- ఘటనాస్థలంలో ఇతర యుద్ధ సామగ్రి స్వాధీనం
- మరో ఉగ్రవాది కోసం కొనసాగుతున్న గాలింపు
- హతమైన ఉగ్రవాది వివరాలు తెలియాల్సి ఉంది



సైనిక విన్యాసాలకు సిద్ధమైన ఇండియన్ ఎయిర్‌ఫోర్స్

భారత్ సైనిక విన్యాసాలకు సిద్ధమవుతుండటంతో పాకిస్థాన్‌లో కలకలం మొదలైంది. రాజస్థాన్‌లో సెప్టెంబర్ 21 నుంచి అక్టోబర్ 7 వరకు 17 రోజుల పాటు విన్యాసాలు నిర్వహించేందుకు నోటమ్ జారీ అయింది. దీంతో పాక్ రక్షణ అధికారులు ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి సరిహద్దుల్లో నిఘా పెంచాలని ఆదేశించినట్లు సమాచారం.

03

- భారత్--పాక్ సరిహద్దులో 17 ని రోజులపాటు భారీ డ్రిల్స్
- సెప్టెంబర్ 21 నుంచి అక్టోబర్ 7 వరకు కొనసాగనున్న విన్యాసాలు
- ఎయిర్‌స్పేస్ ఆంక్షల కోసం నోటమ్ జారీ
- భారత సైనిక కదలికలపై పాక్ నిఘా
- సరిహద్దులో భద్రత పెంచాలని సైనిక అధికారుల ఆదేశాలు
- విన్యాసాలపై పాక్ రక్షణ శాఖ ఉన్నతస్థాయి సమీక్ష
- భారత వైమానిక దళం సంసిద్ధతపై పర్యవేక్షణ
- ఎయిర్‌స్పేస్ భద్రతకు ప్రత్యేక చర్యలు

ఇటలీకి సుదీర్ఘకాల ప్రధానిగా మెలోనీ రికార్డు



03

సురేఖను తప్పించడం బాధాకరం

క్రమశిక్షణ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని స్పష్టీకరణ



- పార్టీలోనే కొనసాగాలని సురేఖను కోరుతున్నాం
- బహిరంగంగా మీడియాతో మాట్లాడటం క్షమించరాని తప్పిదం
- సురేఖ కుమార్తె వ్యాఖ్యలపై అధిష్ఠానం ఆగ్రహం
- పార్టీ నియమాలను ఉల్లంఘించినందుకే కఠిన నిర్ణయం
- సీఎం రేవంత్‌కు బ్లాక్‌మెయిల్ చేయాల్సిన అవసరం లేదు
- పార్టీకి నష్టం కలిగించే వారిని హైకమాండ్ ఉపేక్షించదు
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్

హైదరాబాద్, సెప్టెంబర్ 4 మహాప్రభ

: మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తప్పించడం బాధాకరమైన విషయమని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. సురేఖ బర్తరఫ్ అంశంపై శుక్రవారం ఆయన స్పందించారు. పార్టీలో ఎవరైనా క్రమశిక్షణ ఉల్లంఘిస్తే అధిష్ఠానం నుంచి కఠిన చర్యలు తప్పవని స్పష్టంచేశారు. నాయకులకు తమ అభిప్రాయాలు, సమస్యలను చెప్పుకొనేందుకు పార్టీలో అంతర్గతంగా ఎన్నో వేదికలు ఉన్నాయని, వాటిని కాదని బహిరంగంగా మీడియాతో మాట్లాడటం క్షమించరాని

-మిగతా 3 లో



03

నేడే భారత్ పాక్ పోరు

మహిళల ఆసియాకప్ సమరం
రాత్రి 8గం నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రసారం

- దుబాయ్‌లో చిరకాల ప్రత్యర్థుల సమరం
- వరుస విజయాలతో సెమీస్‌కు చేరిన భారత్
- హ్యాట్రిక్ విజయంపై హర్మన్‌ప్రీత్ సేన కన్ను
- థాయ్‌లాండ్, హాంకాంగ్‌పై ఘన విజయాలు
- హాంకాంగ్‌పై స్మృతి మంధాన విధ్వంసక సెంచరీ
- 124 పరుగులతో చెలరేగిన మంధాన
- గ్రూప్ టాపర్‌గా నిలవాలని టీమిండియా పట్టుదల
- భారత్-పాక్ మ్యాచ్ రాత్రి 8 గంటలకు ప్రారంభం



నేడు కరీంనగర్‌కు కేటీఆర్..

- అంబేద్కర్ స్టేడియంలో జెన్‌జీ సభ
- ఉద్యోగ అవకాశాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై చర్చ
- విద్యార్థులు, యువత భారీగా హాజరయ్యే అవకాశం
- సభ ఏర్పాట్లను పర్యవేక్షించిన గంగుల కమలాకర్
- యువత, విద్యార్థి సంఘాల నేతలతో సమీక్ష
- ఉదయం 10.15 గంటలకు సభకు చేరుకోనున్న కేటీఆర్
- సభకు జన సమీకరణపై బీఆర్ఎస్ నేతల దృష్టి

కరీంనగర్, సెప్టెంబర్ 4 మహాప్రభ

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ శనివారం కరీంనగర్ వస్తున్నట్టు మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తెలిపారు. అంబేద్కర్ మినీస్టేడియంలో విద్యార్థులు, యువత ఉద్యోగ అవకాశాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై నిర్వహించే జెన్‌జీ సభ ఏర్పాట్లను ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పర్యవేక్షించారు.యువత, విద్యార్థి సంఘాల

-మిగతా 3 లో

మూడేళ్ల చిన్నారిపై స్కూల్ వ్యాన్ డ్రైవర్ అత్యాచారం..

-లాస్ట్ స్టాప్ కావడమే శాపం



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4 మహాప్రభ
మహారాష్ట్ర, నవీ ముంబైలో దారుణం జరిగింది. మూడేళ్ల చిన్నారిపై స్కూల్ వ్యాన్ డ్రైవర్ అత్యాచారానికి పాల్పడ్డాడు. అది కూడా స్కూల్ వ్యాన్‌లోనే లైంగిక దాడికి దిగాడు. ఈ ఘటనలో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలివి. నవీ ముంబైలో ఒక మూడేళ్ల చిన్నారి రోజూ స్కూల్ వ్యాన్‌లో పాఠశాలకు వెళ్లి వస్తుండేది. ఆ వ్యాన్‌లో స్కూల్ నుంచి ఇంటికి తిరిగి వచ్చే చివరి చిన్నారి ఆ పాపే.వ్యాన్‌లోని మిగతా వాళ్లు ముందే దిగిపోయేవారు. ఆ మూడేళ్ల పాప అందరికంటే చివరి స్టాప్‌లో దిగాలి. దీంతో మిగతావాళ్లు దిగిన తర్వాత వ్యాన్‌లో ఒంటరిగానే ఉండేది. ఈ క్రమంలో వ్యాన్ డ్రైవర్ పాపపై అత్యాచారానికి పాల్పడ్డాడు. చిన్నారి ఇంటికి వచ్చిన తర్వాత తీవ్ర కడుపు నొప్పితో బాధపడింది. ఈ కడుపు నొప్పి గురించి పాపను తల్లిదండ్రులు ఆరా తీయగా.. స్కూల్ వ్యాన్ డ్రైవర్ తనతో ఎలా ప్రవర్తించింది చెప్పింది. పాప అత్యాచారానికి గురైనట్లు గుర్తించారు. ఈ విషయం తెలిసి షాక్ తిన్న తల్లిదండ్రులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. లాస్ట్ స్టాప్ వరకు వ్యాన్‌లో ఎవరూ లేకపోవడం, పాప ఒక్కర్తే ఉండటం వల్ల ఈ అత్యాచార ఘటన జరిగింది. డ్రైవర్ ఈ దారుణానికి ఒడిగట్టాడు. అయితే, ఇలాంటి ఘటనలు తలెత్తకూడదనే ఉద్దేశంతోనే పిల్లలు ప్రయాణించే స్కూల్ బస్సుల విషయంలో ప్రభుత్వం కొన్ని రూల్స్ రూపొందించింది. దీని ప్రకారం.. స్కూల్ బస్సులో తప్పనిసరిగా ఒక మహిళా సిబ్బంది ఉండాలి. చివరి విద్యార్థి దిగేవరకు ఆ వ్యక్తి బస్సులోనే ఉంటూ, వారి రక్షణ బాధ్యతలు చూసుకోవాలి. అలాగే, స్కూల్ బస్సుల్లో సీసీటీవీ కెమెరాలు, ట్రాకింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలి. దీని ద్వారా తల్లిదండ్రులు తమ పిల్లలు ప్రయాణించే బస్సులను నిరంతరం మానిటరింగ్ చేయగలుగుతారు. అయితే, ఈ ప్రమాణాల్ని పాటించకపోవడం వల్ల విద్యార్థుల భద్రత ప్రశ్నార్థకంగా మారుతోంది.

గంట వర్షానికే ఢిల్లీ అతలాకుతలం

విమానాశ్రయం లోపలికి నీరు

ఢిల్లీ-ఎన్‌సీఆర్‌పై ఐఎండీ రెడ్ వార్నింగ్



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4 మహాప్రభ
శుక్రవారం మధ్యాహ్నం ఓ గంటసేపు కురిసిన భారీ వర్షానికి దేశ రాజధాని ఢిల్లీ అతలాకుతలమైంది. దేశ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్), పశ్చిమ ఢిల్లీలోని పలు ప్రాంతాలు నీట మునిగాయి. సాగర్‌పూర్‌లోని గాంధీ మార్కెట్ సహా అనేక ప్రాంతాల్లో పెద్ద ఎత్తున నీరు చేరింది. చాలా చోట్ల నివాస కాలనీల్లోని రోడ్లు నీట మునిగి, చెరువులను తలపిస్తున్నాయి. ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో భారీ వర్షపాతంపై రెడ్ వార్నింగ్ జారీచేసింది. శనివారం భారీ వర్షాలు, ఉరుములతో కూడిన తుఫానులు ఉంటాయని తెలిపింది.
నీట మునిగిన విమానాశ్రయం
భారీ వర్షానికి ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో నీరు నిలిచిపోయి, విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రయాణికులు విమానాశ్రయంలోకి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. కొంతమంది లగేజీ ట్రాలీలను నీటిలో నెట్టుకుంటూ ప్రవేశ ద్వారాల వైపు వెళ్లడం కనిపించింది.

ఫోక్స్‌వ్యాగన్‌లో లక్ష ఉద్యోగాల కోత

లేఆఫ్ ప్రణాళిక వెల్లడించిన సంస్థ



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4 మహాప్రభ
చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో జర్మన్ ఆటోమొబైల్ దిగ్గజ కంపెనీ ఫోక్స్‌వ్యాగన్ లక్ష మంది ఉద్యోగులకు ఉద్వాసన పలుకుతున్నది. ఈ దశాబ్దం చివరినాటికి లక్షమందిని ఇంటికి పంపించడానికి రంగం సిద్ధమయ్యింది. ఈ మేరకు యాజమాన్యం, కార్మిక సంఘాల మధ్య గురువారం ఒప్పందం జరిగినట్టు ఆడీ, పోర్షే లాంటి 10 బ్రాండ్ల సమూహం కలిగి ఉన్న ఫోక్స్‌వ్యాగన్ ప్రకటించింది.
సంస్థ నుంచి 50 వేల మందిని తొలగించడానికి ఇప్పటికే ఒప్పందం జరుగగా, తాజాగా మరో 50 వేల మంది లేఆఫ్‌నకు సంబంధించిన ఒక ప్రణాళిక ఆమోదం పొందినట్టు తెలిపింది. 'ఆర్థిక వాస్తవాలకు అనుగుణంగా శ్రామిక శక్తిని తీర్చిదిద్దడం కోసం ఈ నిర్ణయం తప్పనిసరి' అని సంస్థ ప్రకటించింది. యూఎస్ టారిఫ్‌లు, ఎలక్ట్రిక్ కార్లకు అస్థిరమైన డిమాండ్, చైనా, ఇతర దేశాల నుంచి వస్తున్న పోటీ తదితర కారణాల వల్ల సంస్థ ఇబ్బందులు ఎదుర్కొంటున్నది. లక్ష మంది తొలగింపు అంటే ప్రపంచంలోని కారు తయారీ సిబ్బందిలో 15 శాతమని వాహనరంగ నిపుణులు పేర్కొంటున్నారు. గతంలో 2009లో జనరల్ మోటర్స్ దివాలా తీసినప్పుడు 50 వేల మంది ఉద్యోగులను తొలగించింది.

బీహార్‌కు వరద ముప్పు..

13 జిల్లాలకు హై అలర్ట్



పాట్నా సెప్టెంబర్ 4 మహాప్రభ
బీహార్‌లో గంగతోపాటు ఎనిమిది నదుల నీటిమట్టం గణనీయంగా పెరుగడంతో 13 జిల్లాలకు వరద ముప్పు ఏర్పడింది. పాట్నా, బక్సర్, ముంగేర్, భాగల్పూర్ సహా పలు ప్రాంతాల్లో గంగా నీటిమట్టం ప్రమాదకర స్థాయిని దాటింది. దీంతో వరద ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలను కమ్యూనిటీ హాళ్లు, తాత్కాలిక శిబిరాలకు తరలిస్తున్నారు. పరిస్థితిని జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తూ, సహాయక చర్యలు చేపడుతున్నది.ప్రజలు నదులు, కాలువలకు దూరంగా ఉండాలని విపత్తు నిర్వహణ శాఖ సూచించింది. పాట్నాలోని గాంధీ ఘాట్, హతీధ్ ప్రాంతాల్లో గంగా నీటిమట్టం వేగంగా పెరుగుతున్నది. ఇదే పరిస్థితి కొనసాగితే పలు రికార్డులు బద్దలయ్యే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. భద్రతా చర్యల్లో భాగంగా పాట్నా రక్షణ గోడకు ఉన్న 108 గేట్లను జిల్లా యంత్రాంగం మూసివేసింది. బక్సర్ జిల్లాలో గంగా నీటిమట్టం ప్రతి గంటకూ రెండు సెంటీమీటర్లు పెరుగుతున్నది.

పంది కిడ్నీతో 9 నెలల జీవనం!

వైద్య చరిత్రలో రికార్డు



న్యూఢిల్లీ: సెప్టెంబర్ 4 మహాప్రభ
చివరి దశ మూత్రపిండాల వైఫల్యంతో(కిడ్నీ ఫెయిల్యూర్) బాధపడుతున్న ఒక 66 ఏండ్ల వృద్ధుడికి మానవ మూత్రపిండాన్ని విజయవంతంగా అమర్చే వరకు జన్యుపరంగా మార్పు చేసిన పంది మూత్రపిండంతో రికార్డు స్థాయిలో తొమ్మిది నెలలపాటు డయాలసిస్ లేకుండా కాపాడినట్టు ది లాన్సెట్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనం పేర్కొంది. బోస్టన్‌లోని మసాచుసెట్స్ ప్రభుత్వ దవాఖానలో దీన్ని నిర్వహించారు. మూత్రపిండాల చివరి దశ వ్యాధితో బాధపడుతున్న రోగులకు మూత్రపిండ మార్పిడీ ఉత్తమ మనుగడను, జీవన నాణ్యతను అందిస్తుంది.

లోటు వర్షపాతంతో పంటలకు చేటు!

-ఎల్ నినోతో క్షీణించిన రుతుపవనాలు



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4 మహాప్రభ
బలపడుతున్న ఎల్ నినో ప్రభావంతో సెప్టెంబర్‌లో వర్షపాతం సగటు కంటే తక్కువగా, ఉష్ణోగ్రతలు సగటు కంటే ఎక్కువగా ఉంటాయని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) అంచనా వేసింది. గత మూడు దశాబ్దాలలోనే ఇది అత్యంత బలహీనమైన రుతుపవన కాలంగా మారవచ్చు. రుతుపవన వర్షాలు బలహీనంగా ప్రారంభం కావడం, నేలలో తగినంత తేమ లేకపోవడం వల్ల పత్తి, సోయాబీన్, మక్క, వరి వంటి ఖరీఫ్ పంటల సాగు ప్రక్రియలో జాప్యం జరిగింది. ఆగస్టులో సగటు కంటే తక్కువ వర్షపాతం కారణంగా ఈ పంటలు ఇప్పటికే తేమ ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. కాయలు ఏర్పడటం, గింజలు నిండటం వంటి కీలక దశలోకి ప్రవేశిస్తున్నాయి. సెప్టెంబర్ వరకు సగటు కంటే తక్కువ వర్షపాతం కొనసాగితే దిగుబడి తగ్గే అవకాశం ఉంది.
శీతాకాలపు పంటల పరిస్థితి
సాధారణంగా సెప్టెంబర్ 17 ప్రాంతంలో భారతదేశ వాయవ్య ప్రాంతం నుంచి రుతుపవనాలు వెనక్కి తగ్గడం మొదలై అక్టోబర్ మధ్య నాటికి పూర్తిగా ఉపసంహరించుకుంటాయి. అదే సమయంలో రైతులు గోధుమలు, ఆవాలు, మక్క, శనగలు వంటి శీతాకాలపు పంటల సాగును ప్రారంభిస్తారు. సెప్టెంబర్ నెల వర్షపాతం నేలలోని తేమను నిర్ధారిస్తుంది. తేమ తక్కువగా ఉండటం విత్తనాల మొలకకు, పంట ఎదుగుదలకు ఆటంకం కలిగిస్తుంది. కొన్ని రాష్ట్రాల్లో నేలలో తేమ సాధారణం కంటే తక్కువగా ఉంటే రైతులు దిగుబడి నష్టాలను, తక్కువ ఆదాయాలను చవిచూడవచ్చు.

ఒరాకిల్‌లో సైలెంట్ లేఆఫ్‌లు!

స్లాక్ ఖాతాల మాయంపై ఉద్యోగుల్లో ఆందోళన
ప్రపంచవ్యాప్తంగా 7,000-10,000 ఉద్యోగాల కోత



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4 మహాప్రభ
: అమెరికన్ టెక్ దిగ్గజం ఒరాకిల్‌లో ఉద్యోగాల కోత నిశ్శబ్దంగా ప్రారంభమైనట్టు తెలుస్తున్నది. ఒరాకిల్ ఉద్యోగులు సెప్టెంబర్ 1న వచ్చే మెయిల్ కోసం వారాల తరబడి సిద్ధమయ్యారు. కానీ వారు ఊహించినట్టు మాత్రం జరగలేదు. గత మార్చి 31న స్థానిక కాలమానం ప్రకారం సుమారు 6 గంటలకు అమెరికా, భారత్, కెనడా వ్యాప్తంగా 10,000 మందికి పైగా ఉద్యోగులకు తొలగింపు మెయిల్స్‌ను ఒరాకిల్ పంపింది.అయితే ఈసారి ఒరాకిల్ సెప్టెంబర్‌లో ఈ ప్రక్రియను నిశ్శబ్దంగా చేపట్టాలని నిర్ణయించుకుంది. రెడిట్ పోస్ట్‌ల ప్రకారం సెప్టెంబర్ నాటి తొలగింపులు ఇప్పటికే మొదలయ్యాయి. మార్చిలో జరిగినట్టుగా ఉదయం 6 గంటలకు ఆకస్మిక తొలగింపుల ప్రక్రియ మొదలుకాలేదు. కానీ సిబ్బంది స్లాక్ ఖాతాలు మాత్రం మాయమవుతున్నాయని తెలుస్తున్నది. కంపెనీ అంతర్గత కమ్యూనికేషన్ యాప్ 'స్లాక్'లో లేఆఫ్‌లకు గురైన వారి ఖాతాలు క్రమక్రమంగా కనిపించకుండా పోతున్నాయనే ప్రచారం జరుగుతున్నది. తాజా ఉద్యోగాల కోతలో ప్రపంచవ్యాప్తంగా 7,000 నుంచి 10,000 ఉద్యోగాలు ప్రభావితం కావచ్చని అంతర్గత వర్గాల అంచనా.

9 రోజుల తర్వాత.. నేపాల్ టన్నెల్‌లో ఇద్దర్ని రక్షించిన ఆర్మీ



కాట్మాండు సెప్టెంబర్ 4 మహాప్రభ
నేపాల్‌లో సంభవించిన జల ప్రళయం తో త్రిశూలీ పవర్ ప్రాజెక్టు టన్నెల్ మూసుకుపోయిన విషయం తెలిసిందే. అయితే వరదలు వచ్చిన 9 రోజుల తర్వాత ఇవాళ రెస్క్యూ సిబ్బంది ఇద్దర్ని సజీవంగా కాపాడారు. త్రిశూలీ 3ఏ ప్రాజెక్టు టన్నెల్ నుంచి ఇద్దర్ని రక్షించినట్లు అధికారులు తెలిపారు. ఆ ఇద్దర్నీ ఫోర్‌మెన్ సంజయ్ సాహ(30), సూపర్‌వైజర్ కబీర్ మహర్జన్(45)గా గుర్తించారు. సంజయ్ సాహ మట్లాడుతూ.. జల విలయం సంభవించిన సమయంలో టన్నెల్‌లోని కార్మికులను సురక్షిత ప్రదేశానికి తరలిస్తున్న సమయంలో తాను ట్రాప్ అయినట్లు పేర్కొన్నాడు. కనీసం నలుగురితో ఆ టన్నెల్‌లో టచ్‌లో ఉన్నట్లు అతను చెప్పాడు. నేపాల్ వరదల వల్ల సుమారు 12 హైడ్రోపవర్ ప్రాజెక్టులు ధ్వంసం అయ్యాయి. వీటిల్లో సుమారు 900 మంది కార్మికులు చిక్కుకున్నారు. దీంట్లో ఇంజినీర్లు, సూపర్‌వైజర్లు కూడా ఉన్నారు. నేపాల్ ఆర్మీ నేతృత్వంలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ప్రత్యేక ఎక్విప్మెంట్ సహకారంతో రెస్క్యూ ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. టన్నెల్‌లో చిక్కుకున్న కొందరితో రెస్క్యూ సిబ్బంది మాట్లాడినట్లు తెలుస్తోంది.

సోనియా గాంధీ ఆత్మకథను ప్రచురించనున్న హార్పర్ కొల్లిన్స్



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4 మహాప్రభ
కాంగ్రెస్ పార్టీ నేత సోనియా గాంధీ తన ఆత్మకథను పుస్తక రూపంలో తీసుకువస్తున్న విషయం తెలిసిందే. అయితే ఆ బుక్‌ను హార్పర్‌కొల్లిన్స్ అనే సంస్థ ప్రచురించనున్నది. కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియా జీవితకథను తాము ప్రచురించనున్నట్లు హార్పర్‌కొల్లిన్స్ తన ఎక్స్ అకౌంట్ ద్వారా ప్రకటించింది. బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్ బై సోనియా గాంధీ బుక్‌లో సోనియా తన స్వీయ అనుభవాలను రాశారు. ఈ ఏడాది నవంబర్ 10వ తేదీన ఆ బుక్‌ను పబ్లిష్ చేయనున్నారు. సోనియా గాంధీ ఆత్మకథ ఈనాటి తరం ఎదురుచూస్తున్న రాజకీయ జీవితకథ అని పబ్లిషర్స్ తెలిపారు. ప్రేమ, ఐడెంటిటీ, తన విధులకు చెందిన వ్యక్తిగత, నాటకీయత కూడిన పుస్తకమని హార్పర్‌కొల్లిన్స్ పేర్కొన్నదిఈ బుక్ ప్రచురణపై వివాదం నెలకొన్నది. బిలాంగింగ్ బుక్‌ను ప్రచురించేందుకు పెంగ్విన్ ర్యాండమ్ హౌజ్ ఇండియా తప్పుకున్నది. సోనియా జీవితకథకు చెందిన బుక్‌లో కొన్ని ఎడిటోరియల్ సవాళ్లు ఎదురయ్యాయని, దాని వల్ల ఆ బుక్‌ను పబ్లిష్ చేయలేకపోతున్నట్లు పెంగ్విన్ ర్యాండమ్ హౌజ్ పేర్కొన్నది.

పోల్‌ను ఢీకొట్టిన ఇండిగో విమానం

ఎయిర్‌పోర్టులో పార్కింగ్ చేస్తుండగా ఘటన



శ్రీనగర్ సెప్టెంబర్ 4 మహాప్రభ
: ఓ ఇండిగో విమానం అనుకోకుండా మెటల్ పోల్‌ను ఢీకొట్టింది. నవీ ముంబై నుంచి బయలుదేరి శుక్రవారం ఉదయం 9గంటలకు శ్రీనగర్ ఎయిర్‌పోర్టులో ఇండిగో 6ఈ 225 అనే ఫ్లైట్ ల్యాండ్ అయింది. పార్కింగ్ చేస్తుండగా అనుకోకుండా పోల్‌ను ఢీకొట్టింది.ఈ ఘటనలో ఫ్లైట్ ముందు భాగం దెబ్బతిన్నది. ప్రయాణికులకు ఎలాంటి ప్రమా దం సంభవించలేదు. ఘటనపై విచారణ జరుపుతామని, విమానంలో ఏమైనా టెక్నికల్ సమస్యలున్నాయో తెలుసుకుంటామని ఇండిగో సంస్థ తెలిపింది.

ఇస్రో జీఎస్ఎల్వీ-ఎఫ్17 ప్రయోగం సక్సెస్

- నింగిలోకి దూసుకెళ్లిన నాటీ బాయ్..
- 2,367 కిలోల ఈఓఎస్-05 ఉపగ్రహం కక్ష్యలోకి
- రక్షణ, వ్యవసాయం, విపత్తుల నిర్వహణకు కీలకం
- సబ్-జీటీఓలోకి కచ్చితత్వంతో ఉపగ్రహ ప్రవేశం
- అత్యాధునిక ఇమేజింగ్ సామర్థ్యాలతో ఈఓఎస్-05
- స్వదేశీ క్రయోజెనిక్ ఇంజిన్ కీలక పాత్ర
- భూ పరిశీలన సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయనున్న ఉపగ్రహం
- వర్షంలోనూ ప్రయోగాన్ని వీక్షించిన 1,500 మంది సందర్శకులు



శ్రీహరికోట:

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో చారిత్రక విజయాన్ని నమోదు చేసింది. శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం (షార్) నుంచి శుక్రవారం తెల్లవారుజామున చేపట్టిన జీఎస్ఎల్వీ-ఎఫ్17.. ప్రయోగం విజయవంతమైంది. రెండో ప్రయోగ వేదిక నుంచి తెల్లవారుజామున 2.55 గంటలకు నింగిలోకి దూసుకెళ్లిన జీఎస్ఎల్వీ-ఎఫ్17.. ప్రయోగం జరిగిన సుమారు 18 నిమిషాల తర్వాత 3.13 గంటలకు 2,367 కిలోల బరువున్న ఈఓఎస్-05 ఉపగ్రహాన్ని నిర్దేశిత సబ్-జియోసింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ (సబ్-జీటీఓ)లోకి విజయవంతంగా ప్రవేశపెట్టింది. పెరీజీ 170 కిలోమీటర్లు, అపోజీ 28,934 కిలోమీటర్లుగా ఉన్న ఈ కక్ష్యలోకి ఉపగ్రహాన్ని కచ్చితత్వంతో చేర్చడంలో ఇస్రో శాస్త్రవేత్తలు సఫలమయ్యారు. సుమారు 51.7 మీటర్ల ఎత్తు, 420.5 టన్నుల బరువున్న జీఎస్ఎల్వీ-ఎఫ్17 ద్వారా చేపట్టిన జీఎస్ఎల్వీ సిరీస్‌లో ఇది 19వ ప్రయోగం. ప్రస్తుతం ఈఓఎస్-05ను సబ్-జీటీఓ నుంచి తుది జియోస్టేషనరీ కక్ష్యలోకి చేర్చే ప్రక్రియ కొనసాగనుంది. ఇందుకోసం ఉపగ్రహంలోని ఆన్‌బోర్డ్ ప్రొపల్షన్ వ్యవస్థను వినియోగించనున్నారు. ఈఓఎస్-05 అత్యాధునిక భూ పరిశీలన సామర్థ్యాలతో రూపొందించిన ఉపగ్రహం. ఇందులో అమర్చిన ఎంఎక్స్-వీఎన్ఆర్ పేలోడ్ అధిక స్పేషియల్ రిజల్యూషన్‌తో భూ పరిశీలనకు ఉపయోగపడనుంది. విస్తృత ప్రాంతాలను స్పష్టంగా చిత్రీకరించడంతో పాటు తక్కువ వ్యవధిలోనే చిత్రాలను అందించే సామర్థ్యం ఈ ఉపగ్రహానికి ఉంది. జియోసింక్రోనస్ కక్ష్యలో ఉండే ఈఓఎస్-05 భారత ఉపఖండాన్ని తరచుగా పర్యవేక్షించేందుకు దోహదపడనుంది. ఈ ఉపగ్రహం నుంచి లభించే చిత్రాలు రక్షణ రంగానికి ఎంతో ఉపయోగపడనున్నాయి. సరిహద్దు ప్రాంతాల్లో పరిస్థితులను పర్యవేక్షించడం, కీలక ప్రాంతాల్లో చోటుచేసుకునే మార్పులను గుర్తించడం వంటి అవసరాలకు ఈ డేటాను వినియోగించవచ్చు. వరదలు, తుపాన్లు, కొండచరియలు విరిగిపడటం వంటి ప్రకృతి విపత్తుల సమయంలో ప్రభావిత ప్రాంతాలను వేగంగా గుర్తించేందుకు కూడా ఉపగ్రహ సమాచారం ఉపయోగపడనుంది. సహాయక చర్యలు, రెస్క్యూ ఆపరేషన్లు, అత్యవసర ప్రణాళికలను మరింత సమర్థంగా రూపొందించేందుకు ఇది దోహదం చేయనుంది. వ్యవసాయ రంగంలోనూ ఈఓఎస్-05 కీలకంగా మారనుంది. పంటల పరిస్థితి, సాగు విస్తీర్ణం, భూమిలో తేమ, నీటి వనరుల స్థితి వంటి అంశాలను పర్యవేక్షించేందుకు ఉపగ్రహ డేటాను వినియోగించవచ్చు. వ్యవసాయ ప్రణాళికలు, నీటి నిర్వహణ, పంటల అంచనాల్లో ఇది ఉపయోగపడనుంది. అలాగే అడవుల విస్తీర్ణంలో మార్పులు, పట్టణ ప్రాంతాల విస్తరణ, భూ వినియోగంలో మార్పులు, సహజ వనరుల పరిస్థితిని దీర్ఘకాలంగా పర్యవేక్షించేందుకు కూడా ఈ ఉపగ్రహం దోహదపడనుంది. జీఎస్ఎల్వీ-ఎఫ్17 మూడు దశల ప్రయోగ వాహకనౌక. ఇందులో అత్యంత క్లిష్టమైన స్వదేశీ క్రయోజెనిక్ అప్పర్ స్టేజ్ ప్రయోగ విజయానికి కీలకంగా నిలిచింది. ఈ దశ సమర్థంగా పనిచేయడంతో ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టడం సాధ్యమైంది. స్వదేశీ క్రయోజెనిక్ సాంకేతికతపై ఇస్రో సాధించిన పట్టు మరోసారి నిరూపితమైంది. జీఎస్ఎల్వీ రాకెట్ గతంలో కొన్ని అనూహ్య ఫలితాలను ఎదుర్కొన్న నేపథ్యంలో దీనికి 'నాటీ బాయ్' అనే మారుపేరు వచ్చింది. 2021 ఆగస్టులో జీఎస్ఎల్వీ-ఎఫ్10 ద్వారా ప్రయోగించిన జీశాట్-1 ఉపగ్రహం నిర్దేశిత కక్ష్యను చేరుకోలేకపోయింది. అయితే ఆ అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకున్న ఇస్రో.. సాంకేతికంగా మరింత మెరుగైన వ్యవస్థలతో చేపట్టిన తాజా ప్రయోగాన్ని విజయవంతంగా పూర్తి చేసింది. భారీ ఉపగ్రహాలను అధిక కక్ష్యల్లోకి ప్రవేశపెట్టే సామర్థ్యాన్ని మరోసారి చాటుకుంది. జీఎస్ఎల్వీ-ఎఫ్17 ప్రయోగాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు లాంచ్ వ్యూ గ్యాలరీకి సుమారు 1,500 మంది సందర్శకులు తరలివచ్చారు. తెల్లవారుజామున 2 గంటల నుంచే వర్షం కురుస్తున్నప్పటికీ వారు వెనక్కి తగ్గలేదు. వర్షంలో తడుస్తూనే రాకెట్ నింగిలోకి దూసుకెళ్లిన అద్భుత ఘట్టాన్ని వీక్షించారు. ఈఓఎస్-05 ప్రయోగం భారత భూ పరిశీలన సామర్థ్యాలను మరింత బలోపేతం చేయడంతో పాటు రక్షణ, విపత్తుల నిర్వహణ, వ్యవసాయం, అటవీ, పర్యావరణ పర్యవేక్షణ వంటి అనేక రంగాలకు ఉపయోగకరమైన సమాచారాన్ని అందించనుంది. స్వదేశీ రాకెట్లు, క్రయోజెనిక్ సాంకేతికత, అధునాతన ఉపగ్రహ వ్యవస్థలతో అంతరిక్ష రంగంలో భారత్ సాధిస్తున్న పురోగతికి జీఎస్ఎల్వీ-ఎఫ్17 విజయం మరో నిదర్శనంగా నిలిచింది.

నాణ్యతలో రాజీ వద్దు

మొదటి తరువాయి

నిర్మాణ నమూనా, స్థలం, భవన విస్తీర్ణం, తరగతి గదులు, ప్రయోగశాలలు తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నాలుగు ఎకరాల స్థలంలో 13,670 చదరపు అడుగుల విస్తీర్ణంలో మూడంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నట్లు ఈడబ్ల్యూఐడీసీ ఎండీ గణపతిరెడ్డి సీఎంకు వివరించారు. భవన నిర్మాణ పనులను పరిశీలించిన సీఎం.. మార్చిలోగా పనులు పూర్తిచేసి, వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

కళాశాల భవనం పక్కన ప్రధాన రహదారి వైపు ఉన్న అదనపు భూమిని సర్వే చేయించాలని కలెక్టర్ ప్రియాంకను సీఎం ఆదేశించారు. అది పట్టా భూమి అయితే కొనుగోలు చేసి కళాశాలకు విశాలమైన ప్రాంగణం, ప్రహరీ నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం చింతల్ దిన్నె వైపు కొనసాగుతున్న సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాల నిర్మాణ పనులను సీఎం పరిశీలించారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తిచేయాలని, జాప్యానికి తావులేకుండా వేగం పెంచాలని ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత విషయంలో రాజీపడవద్దని స్పష్టం చేశారు. గురుకుల పాఠశాల నిర్మాణానికి స్థలం ఇచ్చిన దాతలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో సీఎం ప్రధాన కార్యదర్శి శ్రీధర్, తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, ప్రత్యేక అధికారి వెంకటరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్ కుమార్, అదనపు కలెక్టర్ శ్రీను, డీఆర్ఓ రాజేశ్వరి, మద్దూరు మున్సిపల్ చైర్పర్సన్ సరస్వతి, మాజీ జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ నర్సింహులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

సైనిక విన్యాసాలకు సిద్ధమైన ఇండియన్ ఎయిర్‌ఫోర్స్..

- భారత్--పాక్ సరిహద్దులో 17 రోజులపాటు భారీ డ్రిల్స్
- సెప్టెంబర్ 21 నుంచి అక్టోబర్ 7 వరకు కొనసాగనున్న విన్యాసాలు
- ఎయిర్‌స్పేస్ ఆంక్షల కోసం నోటమ్ జారీ
- భారత సైనిక కదలికలపై పాక్ నిఘా
- సరిహద్దులో భద్రత పెంచాలని సైనిక అధికారుల ఆదేశాలు
- విన్యాసాలపై పాక్ రక్షణ శాఖ ఉన్నతస్థాయి సమీక్ష
- భారత వైమానిక దళం సంసిద్ధతపై పర్యవేక్షణ
- ఎయిర్‌స్పేస్ భద్రతకు ప్రత్యేక చర్యలు



ఇండియా సైనిక కార్యకలాపాలను ప్రారంభించిందంటే చాలు పాకిస్తాన్‌లో వణుకు ప్రారంభమవుతుంది. తాజా పరిణామాలే ఇందుకు ఉదాహరణ. భారత నావికాదళం త్వరలో సైనిక విన్యాసాలు నిర్వహించేందుకు నోటం (నోటీస్ టు ఎయిర్ మిషన్స్) జారీ చేసింది. నావికాదళానికి సంబంధించిన సైనిక విన్యాసాలకు సంబంధించిన ఏర్పాట్ల కోసం ఈ నోటిఫికేషన్ జారీ చేస్తారు. ఇండియా-పాకిస్తాన్ సరిహద్దులో, రాజస్థాన్‌లో 17 రోజులపాటు నోటం జరగనుంది. సెప్టెంబర్ 21 నుంచి అక్టోబర్ 7 వరకు ఈ సైనిక విన్యాసాలు కొనసాగుతాయి. దీనికి సంబంధించిన నోటిఫికేషన్‌ను వాయుసేన విడుదల చేసింది. అయితే, మన ఎయిర్‌ఫోర్స్ సైనిక విన్యాసాలు చేసేందుకు సిద్ధమవుతుంటే పాకిస్తాన్ వణికిపోతోంది. పాకిస్తాన్ రక్షణ శాఖ అధికారులు ఆకస్మికంగా ఒక ఉన్నతస్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఇండియా చేపట్టనున్న సైనిక విన్యాసాలపై సమీక్ష నిర్వహించారు. ఇస్లామాబాద్‌లో ఉన్న భద్రత దళాలా చీఫ్ ఆధ్వర్యంలో ఈ సమీక్ష జరిగింది. ఇండియా-పాక్ సరిహద్దులో ఈ సైనిక విన్యాసాల వల్ల కలిగే పరిణామాలపై చర్చించారు. ఇదే సమయంలో భారత సరిహద్దులో నిఘా పెంచాలని అక్కడి సైనిక అధికారులు ఆదేశించారు. మన సైనిక విన్యాసాల్ని పాక్ సైన్యం నిరంతరం పర్యవేక్షించనుంది. భారత వైమానిక దళానికి సంబంధించి చేపట్టే మార్పులు, సంసిద్ధత, నిషేధాలు వంటి అంశాలపై విమాన ఆపరేటర్లు, సంబంధికులకు అందే రక్షణ నోటిఫికేషన్ నోటం. సైనిక డ్రిల్స్ నిర్వహిస్తున్నప్పుడు మామూలుగానే నోటం జారీ చేస్తుంటారు. ఎయిర్‌స్పేస్‌లో నిషేధాజ్ఞలు, భద్రత వంటివి దీని పరిధిలోకి వస్తాయి. 17 రోజులపాటు భారీ సైనిక విన్యాసాలు జరగనున్నాయి.

కాశ్మీర్‌లో ఎన్‌కౌంటర్..

- ఉగ్రవాది హతం
- బుద్గామ్‌లో భద్రతా బలగాల సంయుక్త ఆపరేషన్
- అఫ్తార్ గలీ అటవీ ప్రాంతంలో ఎదురుకాల్పులు
- ఓ ఉగ్రవాది హతం.. ఏకే రైఫిల్ స్వాధీనం
- సైన్యం, పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సంయుక్త గాలింపు
- కచ్చితమైన నిఘా సమాచారంతో ఆపరేషన్
- ఘటనాస్థలంలో ఇతర యుద్ధ సామగ్రి స్వాధీనం
- మరో ఉగ్రవాది కోసం కొనసాగుతున్న గాలింపు
- హతమైన ఉగ్రవాది వివరాలు తెలియాల్సి ఉంది



శ్రీనగర్:

జమ్మూకాశ్మీర్‌లోని బుద్గామ్ జిల్లాలో భద్రతా బలగాలు చేపట్టిన సంయుక్త ఆపరేషన్‌లో ఓ ఉగ్రవాది హతమయ్యాడు. అఫ్తార్ గలీ అటవీ ప్రాంతంలో శుక్రవారం ఈ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. ఉగ్రవాదుల కదలికలపై అందిన కచ్చితమైన నిఘా సమాచారంతో భారత సైన్యం, జమ్మూకాశ్మీర్ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సంయుక్తంగా గాలింపు చర్యలు చేపట్టాయి. భద్రతా బలగాలకు అనుమానాస్పద కదలికలు కనిపించడంతో అక్కడ ఉన్నవారిని అప్రమత్తం చేశారు. దీంతో ఉగ్రవాదులు కాల్పులు ప్రారంభించగా, భద్రతా బలగాలు ఎదురుకాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో ఒక ఉగ్రవాది హతమయ్యాడు. ఘటనాస్థలంలో ఒక ఏకే రైఫిల్‌తో పాటు ఇతర యుద్ధ సామగ్రి స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. కాగా, హతమైన ఉగ్రవాది వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఇదే ప్రాంతంలో మరో ఉగ్రవాది దాక్కుని ఉండొచ్చన్న అనుమానంతో భద్రతా బలగాలు గాలింపు చర్యలను కొనసాగిస్తున్నాయి. కాశ్మీర్ లోయలో గత కొన్ని నెలలుగా ఉగ్రవాద కార్యకలాపాలు తగ్గుముఖం పట్టిన తర్వాత ఈ ఎన్‌కౌంటర్ చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఇటలీకి సుదీర్ఘకాల ప్రధానిగా మెలోనీ రికార్డు

- 1,413 రోజుల పదవీకాలంతో మెలోనీ రికార్డు
- రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అత్యధిక కాలం ప్రధాని
- మెలోనీకి అభినందనలు తెలిపిన ప్రధాని మోదీ
- మోదీకి ధన్యవాదాలు తెలిపిన ఇటలీ ప్రధాని
- భారత్-ఇటలీ వ్యూహాత్మక భాగస్వామ్యంపై ఇరువురి ప్రశంసలు
- రెండు దేశాల మధ్య సంబంధాలు మరింత బలోపేతం
- మోదీ-మెలోనీ స్నేహం 'మెలోడీ'గా సోషల్ మీడియాలో ఫేమస్
- భారత్-మధ్యప్రాచ్యం-యూరప్ కారిడార్‌పై కలిసి పనిచేయనున్న ఇరుదేశాలు



న్యూఢిల్లీ / రోమ్:

ఇటలీకి అత్యధిక కాలంగా పనిచేస్తున్న ప్రధానిగా జార్జియా మెలోనీ రికార్డు సృష్టించారు. మెలోనీ అక్టోబరు 22, 2022 నుంచి ఇటలీ ప్రధానమంత్రిగా పనిచేస్తున్నారు. గురువారం 1,413 రోజుల నిరంతర పదవీకాలం పూర్తయిన తర్వాత, రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత దేశంలో అత్యధికకాలం నిరంతరం పనిచేసిన ప్రధానమంత్రిగా ఆమెనిలిచారు. గత రికార్డు సిల్వియో బెర్లుస్కోని పేరిట ఉండేది. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ మెలోనీని అభినందిస్తూ, ఇటలీ ప్రజలు ఆమె నాయకత్వంపై ఉంచిన నమ్మకం, విశ్వాసం ఈ మైలురాయిలో ప్రతిబింబిస్తోందని చెప్పారు. నా స్నేహితురాలు ప్రధానమంత్రి మెలోనీకి అభినందనలు అని ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఆమెతో స్నేహం భారత్-ఇటలీ ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించిందని, రెండు దేశాల ప్రజలకు సమృద్ధి భవిష్యత్తు నిర్మించేందుకు సన్నిహిత సహకారం కొనసాగించాలని ఆయన అన్నారు. వచ్చే సంవత్సరాల్లో ఆమె విజయాలకు శుభాకాంక్షలు తెలిపారు. దీనికి స్పందనగా ధన్యవాదాలు ప్రియమైన ప్రధాని మోదీ అని మెలోనీ అన్నారు. ఎక్స్‌లో చేసిన పోస్టులో ప్రియమైన నరేంద్ర మోడీ, మీ మాటలకు, మీ స్నేహానికి ధన్యవాదాలు అని రాశారు. ఇటలీ-భారత దేశం సంబంధం ఈ రోజు ఎప్పటికంటే బలంగా ఉందని అన్నారు. మన చివరి సమావేశంలో ప్రారంభించిన ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం ఈ బంధం ప్రాముఖ్యతను, రెండు దేశాల నైపుణ్యాలను కలిపి, వృద్ధికి కొత్త అవకాశాలు సృష్టించాలనే సంకల్పాన్ని గుర్తిస్తుందని చెప్పారు. ముందున్న అసాధారణ సహకార అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఇటలీ, భారతదేశం కలిసి రెండు ఖండాల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేస్తాయని, భారత్-మధ్యప్రాచ్యం-యూరప్ ఆర్థిక కారిడార్ అభివృద్ధికి కూడా కలిసి పనిచేస్తాయని విశ్వాసాన్ని మెలోనీ వ్యక్తం చేశారు. మోడీ-మెలోనీ స్నేహం సామాజిక మాధ్యమాల్లో 'మెలోడీ' అనే పేరుతో దృష్టిని ఆకర్షిస్తుంది. ఇటీవల రోమ్ పర్యటనలో మోడీ మెలోనీకి మెలోడీ చాక్లెట్ల ప్యాకెట్ బహుమతిగా ఇచ్చిన సందర్భం మళ్లీ చర్చనీయాంశమైంది. ఇరు నాయకుల స్నేహం ద్వైపాక్షిక సంబంధాలను మరింత లోతుగా చేస్తోందని అంతర్జాతీయ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.

ఎల్‌నినో ఉగ్రరూపం..

- వచ్చే ఏడాది వాతావరణం భయానకం
- 2027లో తీవ్ర వాతావరణ పరిస్థితులకు అవకాశం
- ఎల్‌నినో బలపడుతోందని ఐరాస హెచ్చరిక
- 2027 ఫిబ్రవరి వరకు కొనసాగనున్న ఎల్‌నినో
- పసిఫిక్ సముద్రంలో పెరుగుతున్న నీటి ఉష్ణోగ్రతలు
- కరువులు, వరదలు, తుఫాన్ల ముప్పు
- పలు ప్రాంతాల్లో అడవుల్లో కార్చిచ్చుకు అవకాశం
- 2027లో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలకు ఛాన్స్
- వాతావరణ మార్పులతో మరింత పెరగనున్న ముప్పు



జెనీవా:

అతి పెద్ద ఎల్‌నినో రూపుదిద్దు కుంటోందని ఐక్యరాజ్య సమితి(ఐరాస) సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరెస్ హెచ్చరించారు. 2027లో తీవ్ర వాతావరణ పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉందని అన్నారు. ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఓ) తాజా అంచనా ప్రకారం 2027 ఫిబ్రవరి వరకు ఎల్‌నినో కొనసాగే అవకాశం దాదాపు 100 శాతం ఉంది. ఇంత నిశ్చితంగా ఇంతకుముందు ఎప్పుడూ చెప్పలేదు. పసిఫిక్ మహాసముద్రంలో అసాధారణంగా పెరిగిన నీటి ఉష్ణోగ్రతల వల్ల ఎల్‌నినో మరింత బలపడుతోంది. 2026 చివరికి చాలా బలమైన స్థాయికి చేరుకుని తీవ్రస్థాయికి వెళ్తుందని అంచనా. దాని ప్రభావాలు 2027లో కూడా కొనసాగుతాయి. మన కళ్లముందే ఎల్‌నినో అతి పెద్దదిగా మారుతోందని గుటెరెస్ అన్నారు. శాస్త్రం సందేహానికి తావు ఇవ్వడం లేదు. భూగోళం ఇంతకుముందు చూడని జలాల్లో ఉంది, ఆ జలాలు వేడెక్కుతున్నాయి అని ఆయన చెప్పారు. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ప్రపంచ ఉష్ణోగ్రతలు పైకి వెళున్నాయి, ప్రపంచం తీవ్ర వాతావరణ ప్రమాద మండలంలో ఉందని హెచ్చరించారు. పెరుగుతున్న ప్రమాదాలు, ప్రజలను రక్షించే వాతావరణ చర్యల మధ్య పోటీ నడుస్తోంది, ఈ పోటీని గెలవాలని ఆయన పిలుపునిచ్చారు. ఎల్‌నినో ఉగ్రరూపం సమాజాలు, ఆర్థిక వ్యవస్థలపై పెద్ద దెబ్బ తీయగలదని డబ్ల్యూఎంఓ చీఫ్ సెలెస్టే సౌలో అన్నారు. కరువులు, వరదలు ఇప్పటికే అంతరాయం, విధ్వంసం కలిగిస్తున్నాయి. ఎల్ నినో బలపడిన కొద్దీ ఇవి మరింత తీవ్రమవుతాయని ఆమె చెప్పారు. మధ్య, తూర్పు భూమధ్యరేఖ పసిఫిక్‌లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సగటు కంటే చాలా ఎక్కువగా ఉన్నాయి. ఇంకా పెరుగుతున్నాయి. నినో 3.4 సూచిక 2026 మే నుంచి జులై వరకు సగటున 1.5 డిగ్రీల సెల్సియస్ పైన ఉంది. అది జులైలో 2.0 డిగ్రీల సెల్సియస్ పైనకు చేరింది. సెప్టెంబరు నుంచి నవంబరు వరకు దాదాపు అన్ని భూభాగాల్లో సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు ఉండే అవకాశం ఎక్కువ. వర్షపాత నమూనాలు కూడా మారతాయి. కొన్ని ప్రాంతాల్లో కరువు, అడవుల్లో కార్చిచ్చు, మరికొన్ని చోట్ల భారీ వర్షాలు, వరదలు, తుఫానులు రావచ్చు. 2027 సంవత్సరం రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలను నమోదు చేసుకునే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. మానవ కారణాల వల్ల ఇప్పటికే పెరుగుతున్న ఉష్ణోగ్రతలపై ఎల్‌నినో మరింత వేడిని జోడిస్తుంది.

నేడే భారత్-పాక్ పోరు



దుబాయ్:

మహిళల ఆసియాకప్-2026లో మరో ఆసక్తికర పోరుకు రంగం సిద్ధమైంది. నేడు దుబాయ్ వేదికగా చిరకాల ప్రత్యర్థులు భారత్-పాకిస్తాన్ మధ్య కీలక మ్యాచ్ జరగనుంది. గ్రూప్-ఎలో ఇప్పటికే వరుసగా రెండు విజయాలతో సెమీస్ బెర్తు ఖరారు చేసుకున్న టీమిండియా.. నేటి మ్యాచ్‌లో పాకిస్తాన్‌ను కూడా మట్టికరిపించి హ్యాట్రిక్‌తో పాయింట్స్ టేబుల్ టాపర్‌గా గ్రూప్ దశను ముగించాలని పట్టుదలతో ఉంది. తొలి మ్యాచ్‌లో థాయ్‌లాండ్‌ను 94 పరుగుల తేడాతో చిత్తు చేసిన హర్మన్‌ప్రీత్ సేన.. రెండో మ్యాచ్‌లో హాంకాంగ్‌పై 137 పరుగుల భారీ విజయాన్ని నమోదు చేసింది. దీంతో మరో మ్యాచ్ మిగిలుండగానే భారత్ సెమీస్‌కు దూసుకెళ్లింది. ఓపెనర్ స్మృతి మంధాన 64 బంతుల్లోనే 14 ఫోర్లు, 7 భారీ సిక్సర్లతో ఏకంగా 124 పరుగులు చేసి విధ్వంసకర సెంచరీతో టీమిండియాకు అదిరే విజయాన్ని అందించింది. ఇక తమ చివరి గ్రూప్ మ్యాచ్‌లో పాక్‌పై కూడా అదే జోరు కొనసాగించాలని పట్టుదలతో ఉంది.

రేపు బీఆర్ఎస్ఎల్పీ సమావేశం

మొదటి తరువాయి



సమావేశం జరగనుందని ఆ పార్టీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సమావేశానికి హాజరుకావాలని పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కేసీఆర్ సూచించారని పేర్కొంది. తాజా రాజకీయ పరిణామాలు, కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలన, ఇచ్చిన హామీల అమలు, వైఫల్యాలు, 22ఏ పరిధిలోని నిషేధిత భూములు, 97 జీవో వల్ల పాలిటెక్నిక్ విద్యార్థులు, ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక విద్యార్థుల ఆందోళన, కృష్ణా, గోదావరి జలాలపై తెలంగాణ ప్రభుత్వ నిర్లక్ష్యం, ఏపీ జలదోపిడీ వంటి అంశాలపై చర్చించనున్నారు. అసెంబ్లీ, శాసనమండలిలో అనుసరించాల్సిన వ్యూహం, లేవనెత్తిన అంశాలపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు.

నేడు కరీంనగర్‌కు కేటీఆర్..

మొదటి తరువాయి



నాయకులతో కేటీఆర్ సభ, జన సమీకరణపై చర్చించారు. ఉదయం 10.15 గంటలకు కేటీఆర్ నేరుగా అంబేద్కర్ స్టేడియం చేరుకుని సభలో పాల్గొంటారని తెలిపారు.

సురేఖను తప్పించడం బాధాకరం

మొదటి తరువాయి

తప్పిదమని ఆయన పేర్కొన్నారు. కొండా సురేఖ కుమార్తె చేసిన తీవ్ర వ్యాఖ్యలను కనీసం ఆమె ఖండించకపోవడాన్ని కాంగ్రెస్ హైకమాండ్ అత్యంత తీవ్రంగా పరిగణించిందని తెలిపారు. పార్టీ నియమాలను ఖాతరు చేయని వైఖరి కారణంగానే అధిష్ఠానం కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని మహేశ్‌కుమార్ వివరించారు. రాజకీయ లబ్ధి కోసం, ఒత్తిడి తేవడం కోసం ఎవరినీ బ్లాక్‌మెయిల్ చేయాల్సిన అవసరం సీఎం రేవంత్‌రెడ్డికి ఏ మాత్రం లేదని తేల్చిచెప్పారు. మంత్రి పదవి నుంచి తొలగించినప్పటికీ, కొండా సురేఖ పార్టీలోనే కొనసాగాలని తామంతా మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని పేర్కొన్నారు. పార్టీ విధేయత, క్రమశిక్షణను కాపాడేందుకు అధిష్ఠానం ఈ కఠిన వైఖరి అవలంబించిందని, పార్టీకి నష్టం కలిగించేలా ఎవరు వ్యవహరించినా హైకమాండ్ చూస్తూ ఊరుకోదని మహేశ్‌కుమార్ స్పష్టంచేశారు.



ప్రభాత సంధ్యల
భ్రమాభంగం



కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలోనే పాలకుని బుద్ధి బయటపడ్డది. సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా లంకెబిందెల ప్రస్తావన తెచ్చిండు. ముఖ్యమంత్రి నిట్టూర్పులోనే పాలనా తత్వానికి సంబంధించిన ఒక ప్రమాదకరమైన సంకేతం బయటపడ్డది. లంకెబిందెలంటేనే ఏ కష్టం లేకుండా తేరగా తవ్వుకుపోవడం. అందినకాడికి దండుకోవడం. 'లంకెబిందెల' మనస్తత్వమే రైతు సంక్షేమానికి కత్తెర వేసింది. కాంగ్రెస్ నేతలు రూ.2 లక్షల రుణమాఫీ అని చెప్పారు. కానీ రేషన్ కార్డులు, కుటుంబ నిర్ధారణల పేరిట రకరకాల కొర్రీలు పెట్టి వేలాది మంది అర్హులైన రైతులను పథకానికి దూరం పెట్టిండ్రు. ఎకరానికి రూ.15,000 ఇస్తామన్న రైతు భరోసాకు ఆంక్షల గిరిగీసి, ఆఖరికి రూ.12 వేలకు కుదించిండ్రు. దాన్ని కూడా వాయిదాలు పెట్టి సాగును సావు మీదికు తెచ్చిండ్రు. ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఇస్తామన్న మహాలక్ష్మి హామీ దిక్కుమొక్కు లేదు.



అదనంగా తులం బంగారం సంగతి దేవుడెరుగు, అసలు కళ్యాణలక్ష్మి/షాదీ ముబారక్ పథకానికే ఎసరు పెట్టిండ్రు. యువతను ఆకట్టుకోవడానికి 'జాబ్ క్యాలెండర్' ఆశలు రేపింది. ఏటా జూన్ 2న నోటిఫికేషన్లు, డిసెంబర్ 9 నాటికి నియామక పత్రాలు అని ఊరించింది. అధికారంలోకి వచ్చి ఏం చేసింది? జాబ్ క్యాలెండర్‌కు ఉరేసి గోడకు నిర్జీవంగా వేలాడదీసింది. గత ప్రభుత్వ హయాంలో పరీక్షలు పూర్తయి, తుది దశకు చేరిన పోస్టులకు నియామక పత్రాలు అందిస్తూ ఫోటోలు దిగింది. కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగాలను తమ గొప్పలుగా ప్రచారం చేసుకున్నది. మళ్లీ ఇప్పటి వరకు గ్రూప్-2, గ్రూప్-3 లాంటి కొలువుల నోటిఫికేషన్ల ఊసే లేదు. నెలకు రూ.4,000 నిరుద్యోగ భృతి హామీని బడ్జెట్ ప్రసంగాల నుంచి కూడా తుడిచేశారు. అశోక్‌నగర్ గ్రంథాలయాల నీడల్లో పుస్తకాలతో కుస్తీ పడుతూ, ఉద్యోగ నోటిఫికేషన్ కోసం యువత వేచి చూస్తుంటే నోటిఫికేషన్ రాలేదు. కానీ లాఠీలతో పోలీసులు వచ్చిండ్రు. అర్ధరాత్రి వేళల్లో లాఠీచార్జ్‌లు చేయించడం, నిర్బంధాల ఉక్కుపాదం మోపడమే పాలననా?రేవంత్ సర్కార్ తెచ్చిన హైడ్రా, మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్ పేద, మధ్యతరగతి వర్గాల్లో తీవ్రమైన అభద్రతా భావాన్ని ముంచెత్తింది. చెరువుల పరిరక్షణ ముసుగులో పేదల నివాసాలపై బుల్డోజర్లు నడిపించి, బడా బాబుల ఫామ్ హౌస్‌లను వదిలేసిన తీరును రాష్ట్ర ఉన్నత న్యాయస్థానమే తప్పుబట్టింది. హైడ్రా కమిషనర్‌ను తప్పించాలనే కఠిన ఆదేశాలు ఇచ్చింది. దాదాపు లక్షన్నర కోట్ల రూపాయల భారీ అంచనాతో తలపెట్టిన మూసీ ప్రాజెక్ట్, ఫోర్త్ సిటీ, దానిలో జరుపుతున్న సమ్మిట్‌ల విధానపత్రాల్ని నిశితంగా పరిశీలిస్తే.. సామాన్యుడిని విస్మరించి, కార్పొరేట్ భ్రమలను సృష్టించి విఫలమైన చంద్రబాబు 'విజన్ 2020' పునారావృతమవుతున్నదని వెయ్యి రోజుల పాలన తేల్చింది. కాంగ్రెస్ సర్కార్ తెచ్చిన 'భూమాత' రెవెన్యూ చట్టం హామీ కూడా వెయ్యి రోజుల తర్వాత తీవ్ర నిరాశనే మిగిల్చింది. కాంగ్రెస్ పాలకులు ధరణి అధ్యయన కమిటీల పేరుతో ప్రజలను ఏమార్చారు. రాత్రికి రాత్రే 22-ఏ అని తెచ్చి 7 లక్షల ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టిండ్రు. సొంత భూమిని అమ్ముకొనే హక్కు రైతుకు, సొంత ఇంటిని విక్రయించే హక్కు, పిల్లలకు ఇచ్చుకొనే హక్కు యజమానికి లేకుండా చేసిండ్రు. బ్యాంకుల్లో కుదువబెట్టి రుణం కూడా తీసుకోలేని దుస్థితిని తీసుకొచ్చిండ్రు. రాష్ట్రంలోని ప్రతి మూడిండ్లలో ఒక ఇల్లు వివాదమే. 22-ఏ కింద పెట్టిన ప్రతి ఎకరం కూడా ప్రభుత్వ వైఫల్యమే. ఆ తప్పును సరిదిద్దకుండా రైతులు మళ్లీ తహసీల్దార్ కార్యాలయాలు, కలెక్టరేట్ల చుట్టూ దరఖాస్తులతో ప్రదక్షిణలు చేయిస్తే అది పాలన ఎప్పటి కాదు, దుర్మార్గమే. ఒక ప్రాంత అస్తిత్వంతో ముడిపడిన ప్రతీకల విషయంలో పాలకులు సున్నితంగా వ్యవహరించాలి. కానీ మొదటి నుంచి రేవంత్‌రెడ్డికి ఆ సహానుభూతి లేదు. తెలంగాణ తల్లి కొత్త విగ్రహం రూపకల్పన గానీ, సెక్రటేరియట్ ఎదురుగా రాజీవ్ గాంధీ విగ్రహ స్థాపన గానీ, అంద్రా ప్రముఖుల విగ్రహాల ఏర్పాటు ఉద్యమకారులకు, సమాజానికి తీవ్ర మనస్తాపం కలిగించాయి. పాలకులు సాంస్కృతిక అస్తిత్వాన్ని విస్మరిస్తే ఆ అభిప్రాయమే సమాజంలో శాశ్వతంగా స్థిరపడిపోతుంది. తెలంగాణలో ఇప్పుడు జరుగుతున్నది ఇదే. దశాబ్ద కాలంలో పాటు తెలంగాణ మట్టి స్వరూపాన్నే మార్చిన కేసీఆర్‌ను వెయ్యి రోజుల్లో ప్రజలు గుర్తుచేసుకోని రోజంటూ లేదు. 24 గంటల నిరంతర నాణ్యమైన ఉచిత విద్యుత్తు, కాళేశ్వరం లాంటి భారీ నీటిపారుదల ప్రాజెక్టులు, ఎండిన బీడును కూడా సస్యశ్యామలం చేసిన తీరు, కోటి ఎకరాల మాగాణం ఒక భౌతిక వాస్తవం. పల్లెలు, పట్టణాలు ప్రగతిబాటలో పచ్చగా రూపుదిద్దుకున్న రాష్ట్ర ముఖచిత్రం స్వయం సమృద్ధికి ప్రతీకగా నిలిచింది.ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే అసలైన అభివృద్ధిని విస్మరించి, అడ్డూ అదుపు లేని మాటలతో కేసీఆర్‌ను తిట్టడమే పాలన అనుకుంటే ప్రజలు చూస్తూ ఊరుకోరు. అధికారంలోకి వచ్చిన మొదటి రోజుల్లో గత పాలనను అకారణంగా నిందించడం రాజకీయం కావొచ్చు. కానీ వెయ్యి రోజులు గడిచిన తర్వాత కూడా ప్రతి వైఫల్యానికీ గత ప్రభుత్వాన్నే సాకుగా చూపించడం నేటి పాలకుల చేతకానితనానికి నిదర్శనం. నేటి పాలనా వైఫల్యాలకు జవాబు చెప్పాల్సిన బాధ్యత కాంగ్రెస్ నేతలు, అధినేతల మీదనే ఉన్నది. కొలువుల క్యాలెండర్ ఏమైంది? విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలకు పరిష్కారం ఎప్పుడు? గురుకులాల్లో పేద పిల్లల ప్రాణాలకు భద్రత కల్పించాల్సిన బాధ్యత ఎవరిది? మూసీ, హైడ్రా పేర్లతో పేదల ఇండ్లపై బుల్డోజర్లు నడుపడమే పాలనా? ఈ ప్రశ్నలు నేడు తెలంగాణ సమాజంలో ఆవేదనతో నిండిన గుండెల్లోంచి వెయ్యి పడగలై కాంగ్రెస్ పాలనపైకి లేస్తున్నాయి.

అర్ధరాత్రి పోలీస్ విధులపై
అదనపు ఎస్పీ ఆకస్మిక తనిఖీ.

-పెట్రోలింగ్, బ్లూకోల్ట్స్, బీట్ సిబ్బంది విధుల పరిశీలన.
-అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై ప్రత్యేక నిఘా.
-మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఐపీఎస్.

మెదక్ జిల్లా -04సెప్టెంబర్ (మహాప్రభ).
రాత్రి వేళల్లో పోలీసు సిబ్బంది నిర్వహిస్తున్న పెట్రోలింగ్, బ్లూకోల్ట్స్, బీట్ డ్యూటీలను మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఐపీఎస్ అర్ధరాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణంలోని ప్రధాన ప్రాంతాల్లో పర్యటించి విధుల్లో ఉన్న సిబ్బంది పనితీరును పరిశీలించారు.ప్రధాన రహదారులు, కూడళ్లు, జనసంచారం తక్కువగా ఉండే ప్రాంతాల్లో పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలని, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై నిఘా ఉంచాలని అదనపు ఎస్పీ ఆదేశించారు. అనుమానితుల వివరాలను ఫింగర్‌ప్రింట్ ఆధారిత పాపిలాన్ డివైస్ ద్వారా



పరిశీలించాలని సూచించారు. వాహన తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలను క్రమం తప్పకుండా నిర్వహించాలని, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లాడ్జీలు, హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి కొత్తగా బస చేస్తున్న వారి వివరాలను పరిశీలించాలని సూచించారు. బీట్ సిబ్బంది తమ పరిధిలోని కాలనీలు, ప్రధాన కూడళ్లు, రహదారుల్లో విస్తృతంగా పర్యటిస్తూ నేరాల నివారణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. దొంగతనాలు, ఇతర ప్రాపర్టీ నేరాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, ముందస్తు చర్యలతో నేరాలను అరికట్టాలని అదనపు ఎస్పీ ఆదేశించారు. విధుల్లో ఉన్న సిబ్బంది బాధ్యతాయుతంగా, అప్రమత్తంగా వ్యవహరిస్తూ ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రజలకు సురక్షిత వాతావరణం కల్పించేందుకు జిల్లా పోలీస్ శాఖ నిరంతరం చర్యలు చేపడుతోందని అదనపు ఎస్పీ తెలిపారు.

రామాయంపేట మున్సిపాలిటీలో డ్రైడే - ఫ్రైడే కార్యక్రమం



రామాయంపేట సెప్టెంబర్ 4 మహాప్రభ
రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో శుక్రవారం డ్రైడే – ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ఏ. రవీందర్ మరియు కౌన్సిలర్ దేవుని రంజిత్ ఆధ్వర్యంలో శానిటరీ ఇన్స్పెక్టర్ వనిత, మున్సిపల్ శానిటేషన్ సిబ్బందితో కలిసి మురికి కాలువల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. అనంతరం స్థానిక ప్రజలకు అంటు వ్యాధులపై అవగాహన కల్పించారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్



దేవరకొండ సెప్టెంబర్ 4(మహా పభ)
దేవరకొండ మండలం పడమటిపల్లిలోని శుభం గార్డెన్‌లో జరిగిన వివాహ వేడుకలకు దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, వారు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు.ఈ వివాహ వేడుకల్లో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ బీల్యా నాయక్, పి.ఎ.సి.ఎస్. చైర్మన్ పల్లా ప్రవీణ్ రెడ్డి, స్థానిక సర్పంచ్ పల్లా శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

ప్రజల రక్షణ పట్ల విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం

మంథని, సెప్టెంబర్ 4 మహాప్రభ
మంథని మున్సిపాలిటీ పరిధిలోని ఆరో వార్డు బోయిన్ పేట్ ప్రాంతంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరో వార్డు కౌన్సిలర్ పోతరవేని శ్రీలత, క్రాంతి ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమంలో భాగంగా కొత్తగా ఇళ్ల నిర్మాణం జరుగుతున్న ప్రాంతాల్లో అవసరమైన చోట విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఇళ్ల నిర్మాణానికి అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలను తొలగించి నిర్మాణ పనులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత విద్యుత్ అధికారులపై ఉందన్నారు. బోయిన్ పేటలోని కొన్ని వాడల్లో విద్యుత్ స్తంభాలు లేకపోవడంతో రాత్రి సమయంలో ప్రజలు చీకటిలోనే రాకపోకలు సాగించాల్సి వస్తోందని వారు అన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు రాత్రి వేళల్లో బయటకు రావడానికి జంకుతున్నారని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు విరిగిపోయి ప్రమాదకరంగా ఉన్నాయని, మరికొన్ని చోట్ల పాత ఇనుప స్తంభాలు ఉండటంతో ప్రజలకు ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. వర్షాలు, ఈదురుగాలులు, గాలి దుమారాల సమయంలో బలహీనంగా ఉన్న స్తంభాలు విరిగిపడితే పెద్ద ప్రమాదం జరిగి అధిక ప్రాణ, ఆస్తి నష్టం జరిగే





అవకాశం ఉందని హెచ్చరించారు. ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు సమస్యను నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. బోయిన్ పేటకు వెళ్లే ప్రధాన రహదారి పాత కట్టపై విద్యుత్ స్తంభాలు లేకపోవడంతో రాత్రి వేళల్లో రహదారి మొత్తం చీకటిగా మారుతోందని కౌన్సిలర్ తెలిపారు. ఈ మార్గంలో నిత్యం అనేక మంది ప్రజలు ప్రయాణిస్తుంటారని, సరైన వెలుతురు లేకపోవడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ సమస్యలను పలుమార్లు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అధికారులు ఇంకా నిర్లక్ష్యం చేస్తే ప్రజలను సమీకరించి విద్యుత్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు విద్యుత్ కార్యాలయం ఎదుట ఆందోళన కొనసాగిస్తామని, అవసరమైతే నిరాహార దీక్షకు కూడా సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు ముప్పు కలిగే పరిస్థితులు ఏర్పడిన తర్వాత స్పందించడం కాకుండా ముందుగానే సమస్యలను పరిష్కరించాలని విద్యుత్ అధికారులను వారు కోరారు..

శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో కుంకుమార్చన

చౌటుప్పల్ సెప్టెంబర్ 4 మహాప్రభ
చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో త్రినిటీ విద్యాలయాల సంస్థ మరియు గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ సౌజన్యంతో తేదీ 4 సెప్టెంబర్ 2026 శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో శ్రావణమాసం నాలుగవ శుక్రవారం సందర్భంగా మహిళా భక్తులచే ప్రత్యేకంగా కాశీ నుండి తెచ్చిన శ్రీ చక్రములపై కుంకుమ అర్చన కార్యక్రమం వేద పండితులు పెద్ది సుధాకర్ శర్మ వేద మంత్రోచ్ఛరణలతో కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోగుదాల పావని రమేష్ గౌడ్ పాల్గొని మాట్లాడుతూ. ఈ కార్యక్రమంలో పాల్గొని శ్రీ భవాని మాత ఆశీర్వాదం కొరకు కుంకుమార్చన నిర్వహించిన ప్రతి భక్తురాలకి అమ్మవారి ఆశీస్సులు ఉండాలని అదేవిధంగా చౌటుప్పల్ మున్సిపల్ ప్రజలు అమ్మవారి ఆశీస్సులతో సుఖశాంతులతో వర్ధిల్లాలని కోరుకున్నారు. ఈ



కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దేవాలయ కమిటీ ధర్మకర్తలకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ బొబ్బిళ్ళ మురళి గురుస్వామి, మున్సిపల్ వైస్ చైర్మన్ గోషిక వినయ్ కుమార్ , పిల్లలమర్రి మధుసూదన్, బత్తుల వాణి విప్లగౌడ్, కాసర్ల మంజుల, కో- ఆప్షన్ సభ్యులు సందగళ్ళ విజయ, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ అధ్యక్షురాలు వెన్ రెడ్డి సంధ్య, ట్రినిటీ స్కూల్ ప్రిన్సిపల్ డాక్టర్ ఉజ్జీనీ మంజుల, పెద్ది స్వాతి కిషోర్ శర్మ ధర్మకర్తలు వరకాల రవి గౌడ్, ఆవుల యేసు యాదవ్, దాడి యశ్వంత్ రెడ్డి, గగులోతు అరుణ, బొబ్బిళ్ళ సంధ్య పర్కాల వెన్నెల, పబ్బు శ్రీకాంత్ గౌడ్, మోగుదాల వెంకటేష్ గౌడ్, మునుకుంట్ల పద్మావతి, సుర్వి మంజుల, దాడి పద్మ, ముతుకులోజు నీరజ, వనం మమత, సింగిరి కొండ శైలజ, బడుగు గౌరీశ్వరి, బొబ్బిళ్ళ యశోద, మన్నె శివరాణి, బొడిగ రాధిక, పగడాల అనూష, మామిడి వెంకటమ్మ, శాలిని, అనూష, ప్రసన్నలక్ష్మి జూకంటి రేవతి, ఎలమొని హారిక, కాసాని ఐలమ్మ, కీర్తన, పార్సి సంధ్య, పార్సి నికిత, బొబ్బిళ్ళ సామ్రాట్, మునుకుంట్ల శేఖర్ గౌడ్, డాకోజి అజయ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం

సామాజికవేత్త సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్



దేవరకొండ సెప్టెంబర్ 4 (మహాప్రభ)
దేవరకొండ పట్టణంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా ప్రైవేట్ టీచర్స్ ఫోరం లోని ఉపాధ్యాయులను జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఒకరోజు ముందుగా ప్రైవేట్ టీచర్లను ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా సామాజికవేత్త, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ప్రపంచంలో కొలువ లేనిదని వారి సేవలు ఎనలేని ప్రపంచానికి మేధావులను తయారు చేసే యంత్రాలు గురువులే అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్ కోటేశ్వరరావు, డి రుణాదేవి హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, ముడి అంజయ్య, ముడి రాజశ్రీ, ఎండి రంజాన్ బేగ్, ఆడారపు గణేష్, ఉడుత సలేశ్వర్ యాదవ్, బొడ్డు వెంకటరమణ, గడ్డం బిక్షమయ్య, అప్పం వీరయ్య, పున్న బిక్షమయ్య, డాక్టర్ భాషా చౌహన్, ఆర్ జ్యోతి, ఎం సుజాత, కనీష్, లావణ్య, పర్వీన్, కే సంజీవ్, టి రవికుమార్, లచ్చిరాం నాయక్, ప్రైవేటు ఉపాధ్యాయులు మరియు తదితరులు పాల్గొన్నారు.

కురుమూర్తి గుట్టలపై అక్రమ మైనింగ్ ఆరోపణలు

-అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్నారని బీజేపీ నేత కొండ ప్రశాంత్‌రెడ్డి విమర్శ



దేవరకద్ర నియోజకవర్గ సెప్టెంబర్ 4 మహాప్రభ
చిన్నచింతకుంట మండలం : శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థానం పరిధిలోని పెద్దగుట్ట నుంచి రోడ్డు పనుల పేరుతో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి, ఇసుక తరలిస్తున్నారని బీజేపీ దేవరకద్ర నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొండ ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. ఎమ్మెల్యే అనుచరులు కాంట్రాక్టర్లకు మట్టి విక్రయిస్తున్నారని ఆయన విమర్శించారు. దేవస్థానం గుట్టలను తవ్వడం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లడంతో పాటు వన్యప్రాణుల ఆవాసాలకు ముప్పు ఏర్పడుతుందని ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మైనింగ్ శాఖ అనుమతులు, ప్రభుత్వ నిబంధనలు పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్ల పనులకు తాము వ్యతిరేకం కాదని, అవసరమైన మట్టి, ఇసుకను ప్రభుత్వ అనుమతులతో ఇతర ప్రాంతాల నుంచి సమకూర్చుకోవాలని సూచించారు. దేవస్థాన గుట్టల నుంచి మట్టి తరలిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు లేకపోవడం బాధాకరమన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనూ ప్రాజెక్టులు, చెక్‌డ్యామ్‌లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో మట్టి తరలింపు జరిగిందని, అదే పరిస్థితి పునరావృతమైతే కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా ప్రజలు గుణపాఠం చెబుతారని ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు కుర్వ రమేష్, భరత్‌భూషణ్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు డాబా శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి రవీందర్‌రెడ్డి, బడుగుల రాజేశ్వర్‌రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

1000 రోజుల కాంగ్రెస్ దగా పాలనపై బీఆర్ఎస్ సమరభేరి

-భూత్పూర్‌లో భారీ ర్యాలీ.. ధర్నా.. వంటా-వార్పుతో నిరసన



దేవరకద్ర సెప్టెంబర్ 4 మహా ప్రభ దేవరకద్ర నియోజకవర్గం
భూత్పూర్: కాంగ్రెస్ ప్రభుత్వ హామీల వైఫల్యం, ప్రజా సమస్యలపై నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ భూత్పూర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, ధర్నా, వంటా-వార్పు కార్యక్రమం నిర్వహించారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈకార్యక్రమం సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫోన్‌లో ఆల వెంకటేశ్వర్ రెడ్డితో మాట్లాడి దేవరకద్ర గులాబీ సైన్యాన్ని అభినందించారు. ప్రజల పక్షాన పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని సూచించారు. త్వరలో దేవరకద్రకు వచ్చి కార్యకర్తలు, ప్రజలను కలుస్తానని తెలిపారు. "రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదు.. హామీల అమలులో ప్రభుత్వం విఫలమైంది" అని కేటీఆర్ పేర్కొంటూ, ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పోరాటాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు.

బీఆర్ఎస్ పదేళ్లలో చేయనిది.. కాంగ్రెస్ వెయ్యి రోజుల్లో చేసి చూపించింది





-దేవరకద్ర అభివృద్ధిపై ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి ధీమా

దేవరకద్ర నియోజకవర్గ సెప్టెంబర్ 4 మహా ప్రభ దేవరకద్ర
కొత్తకోట/మదనపురం: బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో దేవరకద్ర నియోజకవర్గ అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెయ్యి రోజుల్లోనే అనేక అభివృద్ధి పనులు చేపట్టి ముందుకు తీసుకెళ్తున్నామని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రజాపాలన వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా మదనపురం, కొత్తకోట మండలాల్లో నిర్వహించిన సంబరాలు, బైక్ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. దుప్పల్లి నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ పలు గ్రామాల మీదుగా కొత్తకోటకు చేరుకుంది. అనంతరం నిర్వహించిన సభల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల



మేరకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ వంటి పథకాలను అమలు చేస్తోందన్నారు. నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, మదనపురం మండలంలో 319, కొత్తకోట మండలంలో 514, కొత్తకోట పట్టణంలో 146 ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. అర్హులైన కుటుంబాలకు ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం అందిస్తున్నామని చెప్పారు. మదనపురం--ఆత్మకూరు మధ్య పెండింగ్‌లో ఉన్న బ్రిడ్జి పనులను రూ.6 కోట్లతో పూర్తి చేశామని, శంకరపేట--దంతనూర్ ప్రాంతాల్లో మరో బ్రిడ్జిని రూ.కోటితో నిర్మించామని తెలిపారు. మదనపురం మండలంలోని మూడు లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల మరమ్మతులకు రూ.5 కోట్లు తీసుకొచ్చామన్నారు. దేవరకద్రలో 100 పడకల ఆసుపత్రి, కొత్తకోటలో 30 పడకల ఆసుపత్రి నిర్మాణాలు కొనసాగుతున్నాయని, విద్యారంగంలో దేవరకద్రలో డిగ్రీ కళాశాల, చిన్నచింతకుంటలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. బీఆర్ఎస్ పదేళ్లలో చేయలేని పనులను కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల్లో చేస్తుండటాన్ని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి జీర్ణించుకోలేక ఫ్రస్టేషన్‌కు గురవుతున్నారని ఎమ్మెల్యే విమర్శించారు. ప్రజలు గత పాలన, ప్రస్తుత పాలనను బేరీజు వేసుకుని కాంగ్రెస్‌కు అండగా నిలుస్తున్నారని అన్నారు.

శ్రీ విద్య పాఠశాలలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



పాపన్నపేట, సెప్టెంబర్ 04:(మహా ప్రభ)
పాపన్నపేట మండల కేంద్రంలోని శ్రీవిద్య పాఠశాల లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శుక్రవారం అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణం లో జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషాధారణలతో అలంకరించి ప్రత్యేక ఆకర్షణంగా నిలిచారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రిన్సిపాల్ రవీందర్ గుప్తా పూజలు నిర్వహించి అనంతరం పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఉట్టి కొట్టే విద్యార్థులు విశేష ఉత్సాహాన్ని నింపాయి. విద్యార్థులు పోటీ పడుతూ ఉట్టి కొట్టారు.. చిన్నారుల నృత్యాలు, సాంప్రదాయ ప్రదర్శనలు తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలు నైతిక విలువలను పిల్లలకు చిన్నతనం నుంచే అలవర్చడానికి ఇటువంటి ఉత్సవాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. శ్రీకృష్ణుని జీవితం మనకు ధర్మం, సమయస్ఫూర్తి, సోదర భావాన్ని నేర్పుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ విటలాక్షప్ప, సుమన్, పిటీలు నిఖిత, కృష్ణ,ఉపాధ్యాయులు జ్యోతి ప్రధాన్, విలాస్, ఆర్గిల్, వసుంధర, ఇందిరా, సుజాత, వనజ, గౌతమి, స్రవంతి, అశ్విని,నిర్మల, సునీత, ప్రియాంక, విజయ, దుర్గ, లావణ్య, షీలా, అనురాధ, పల్లవి, తదితరులు పాల్గొన్నారు....

శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న పద్మ దేవేందర్‌రెడ్డి..

-చిన్నారుల నృత్య ప్రదర్శనలు తిలకించి అభినందనలు...

--చిన్నారులతో కలిసి కోలాటం ఆడిన మాజీ డిప్యూటీ స్పీకర్..

మెదక్ జిల్లా,-04సెప్టెంబర్ (మహాప్రభ).
మెదక్--చేగుంట రహదారి మార్గంలోని శంకరంపేట మండల కేంద్రం సమీపంలో గల శ్రీ అనంత పద్మనాభ స్వామి దేవాలయం గుట్ట వద్ద శ్రీకృష్ణ ధ్యాన మందిర్ శ్రీ గోకులంలో శ్రీకృష్ణాష్టమి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మ దేవేందర్‌రెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.శ్రీకృష్ణాష్టమి సందర్భంగా చిన్నారులు నిర్వహించిన నృత్య ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. చిన్నారుల నృత్యాలను పద్మ దేవేందర్‌రెడ్డి ఆసక్తిగా తిలకించి వారిని అభినందించారు. చిన్నారుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం అభినందనీయమని అన్నారు. వేడుకల్లో భాగంగా చిన్నారులతో కలిసి



పద్మ దేవేందర్‌రెడ్డి ఉత్సాహంగా కోలాటం ఆడారు. చిన్నారులతో మమేకమై కోలాటంలో పాల్గొని సందడి చేశారు. దీంతో అక్కడి వాతావరణం మరింత ఉత్సాహభరితంగా మారింది. చిన్నారులు, భక్తులు ఆమెతో కలిసి ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా పద్మ దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. శ్రీకృష్ణుడి బోధనలు సమాజానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. భగవద్గీత ద్వారా శ్రీకృష్ణుడు అందించిన సందేశాలు ప్రతి ఒక్కరికీ మార్గదర్శకమని పేర్కొన్నారు. చిన్నారులకు చిన్ననాటి నుంచే ఆధ్యాత్మిక, సాంస్కృతిక విలువలను అలవర్చాలని సూచించారు. శ్రీకృష్ణుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని పద్మ దేవేందర్‌రెడ్డి ఆకాంక్షించారు. భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించడం ద్వారా ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో మండల సర్పంచ్ల ఫోరం మాజీ అధ్యక్షులు పూలపల్లి యాదగిరి యాదవ్, నాయకులు లక్ష్మారెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఏమా చంద్రం, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ల మల్లికార్జున్ గౌడ్,శేరిపల్లి సర్పంచ్ సంతోష గౌండస్వామి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, వార్డు సభ్యులు ఆలూరి రవి, సునీల్, గోపాల్, నాయకులు చంద్రం, రాము యాదవ్, గడ్డమీద కృష్ణ గౌడ్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ఆర్కే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ముగియనున్న అఖండ శివ నామ తాళ సప్తాహ:

- వేలాదిగా తరలిరానున్న భక్తులు..

- ఏర్పాట్లు చేయనున్న గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు..



పాపన్నపేట సెప్టెంబర్04(మహాప్రభ)
మండలం పరిధిలోని కుర్తివాడ శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి వారి సన్నిధిలో ప్రతి సంవత్సరం శ్రావణ మాసంలో నిర్వహించే అఖండ శివనామ సప్తాహ కార్యక్రమం ఈ సంవత్సరం గత ఆదివారం ప్రారంభమైన ఇట్టి కార్యక్రమం ఏడు రోజులపాటు భక్తి శ్రద్ధలతో దిగ్విజయముగా కొనసాగుతున్న ఓం నమః శివాయ తాళ సప్తాహ కార్యక్రమం నేడు శనివారం ఉదయం 11 గంటలకు వైభవంగా ముగియనుంది.ఇట్టి కార్యక్రమానికి వేలాదిగా భక్తులకు తరలిరానన్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేయనున్నారు నేడు ముగింపు సందర్భంగా ఉద్వాసన అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలు, అన్న ప్రసాద వితరణ జరుపబడును. కావున మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కుర్తివాడ గ్రామ ఉత్సవ కమిటీ సభ్యులు కోరుతున్నారు.

ఉచిత కంటిపోర శిబిరం వాల్ పోస్టర్లను ఆవిష్కరించిన దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్



దేవరకొండ సెప్టెంబర్ 4 (మహాప్రభ)
దేవరకొండ: ఉచిత కంటి శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ కోరారు.శుక్రవారం దేవరకొండ పడమటిపల్లిలో పల్లా నర్సిరెడ్డి మెమోరియల్ సొసైటీ మరియు శంకర నేత్రాలయం, హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత కంటిపోర శిబిరంకు సంబంధించిన వాల్ పోస్టర్లను రమావత్ రవీంద్ర కుమార్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.....కంటి సమస్యలతో బాధపడుతున్న పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు ఇలాంటి శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కంటి చూపు సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ ఉచిత కంటి శిబిరానికి హాజరై వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అవసరమైన వారికి వైద్యుల సూచనల మేరకు కంటిపోర శస్త్రచికిత్సలు కూడా అందుబాటులో ఉంటాయని తెలిపారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ బీల్యా నాయక్, పి.ఎ.సి.ఎస్. చైర్మన్ పల్లా ప్రవీణ్ రెడ్డి, స్థానిక సర్పంచ్ పల్లా శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామావత్ టమ్మ కుటుంబ సభ్యులకు పరామర్శించి బి ఆర్ ఎస్ దేవరకొండ నియోజకవర్గం నాయకులు వడ్త్య రమేష్.



దేవరకొండ డివిజన్ సెప్టెంబర్ 4 (మహాప్రభ)
కొండ మల్లేపల్లి మండలం శుక్రవారం గౌరి కుంట తండా కి చెందిన బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు రామావత్ రమేష్.నానమ్మ రెండు రోజుల క్రితం స్వర్గస్థులు అయినారు ఈ రోజు వారి దశదిన కర్మ కార్యక్రమంలో భాగంగా వారి స్వగ్రామం కి వెళ్లి వారి కుటుంబ సభ్యులు పరామర్శించిన బి ఆర్ ఎస్ పార్టీ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్ .ఆయన వెంట పెద్దిశెట్టి సత్యం కొండ మల్లేపల్లి సర్పంచ్ అభ్యర్థి శివ గౌడ్, బీమా,కోటేష్, తదితరులు పాల్గొన్నారు

పాలంలో అక్రమంగా అర్ధరాత్రి కంటైనర్ పెట్టారని ఫిర్యాదు.

పట్టా భూమిలో అక్రమ ప్రవేశం.. అరాచకాలకు, బెదిరింపులకు పాల్పడుతున్నారని రైతు ఆరోపణ.



మనోహరాబాద్ సెప్టెంబర్ 4,(మహాప్రభ)
మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం రామాయంపల్లి గ్రామ శివారులోని సర్వే నంబర్ 132లో తన పట్టా వ్యవసాయ భూమిలోకి జక్కుల కిష్టయ్య, అతని అనుచరులు అక్రమంగా ప్రవేశించి అర్ధరాత్రి సమయంలో కంటైనర్ ఏర్పాటు చేశారని భూయజమాని జుట్టు సత్యనారాయణ ఆరోపించారు. ఈ ఘటనపై 112కు ఫోన్ చేసి, మనోహరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. జూలై 5, 2026 నుంచి కిష్టయ్య తన పొలంలోకి ప్రవేశించి కంటైనర్ ఏర్పాటు చేస్తానంటూ బెదిరిస్తున్నారని, అడ్డుకుంటే చంపేస్తానంటూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని సత్యనారాయణ ఆరోపించారు. గతంలోనూ తనను చంపుతానని జర్నలిస్టు బెదిరించడంతో కేసు నమోదైందని పేర్కొన్నారు. తన తాతలు, తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన పట్టా భూమిలో ఎలాంటి హక్కు పత్రాలు లేకుండా అక్రమంగా ప్రవేశిస్తున్నారని, భూమాఫియా అండదండలతోనే ఈ వ్యవహారం జరుగుతోందని ఆయన ఆరోపించారు. పోలీసులపై కూడా ఒత్తిడి తెచ్చే విధంగా ఖర్చు చేస్తానంటూ కిష్టయ్య చెప్పినట్లు సత్యనారాయణ తెలిపారు.గతంలో తనకు గుండెపోటు వచ్చిన పరిస్థితి కూడా ఉందని, ప్రస్తుతం జరుగుతున్న బెదిరింపులతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నానని చెప్పారు. జక్కుల కిష్టయ్య, అతని అనుచరులపై చట్టపరమైన చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని పోలీసులను, రెవెన్యూ అధికారులను కోరారు.

బాలకృష్ణుడు.. బాలరాధగా చిన్నారుల భక్తి సందడి



దేవరకద్ర, సెప్టెంబర్ 4:
మహాప్రభ దేవరకద్ర శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని దేవరకద్ర మున్సిపాలిటీలోని బీసీ కాలనీ రైల్వే స్టేషన్ పరిసరాల్లో మోహన్--సువర్ణ దంపతుల కుమారుడు, కుమార్తె బాలకృష్ణుడు, బాలరాధ వేషధారణలో ముస్తాబై భక్తులను ఆకట్టుకున్నారు. చిన్ని కృష్ణుడిగా, రాధగా సంప్రదాయ అలంకరణలో మెరిసిన చిన్నారులు పండుగకు మరింత శోభను తీసుకొచ్చారు. చిన్నారుల ముద్దుముద్దు వేషధారణ చిన్నారులను విశేషంగా ఆకట్టుకోగా, పరిసరాల్లో జన్మాష్టమి భక్తిభావాన్ని నింపింది

కుర్మేడ్ నవోదయ పాఠశాలలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



దేవరకొండ డివిజన్ సెప్టెంబర్ 4 (మహాప్రభ)
చింతపల్లి మండల పరిధిలోని.కుర్మేడ్ ఎక్స్ రోడ్ లోని నవోదయ ఇ/మీ పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలను పాఠశాల కరస్పాండెంట్ అనంతుల జంగయ్యగౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. విద్యార్థినీ, విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని వేడుకలను సందడిగా నిర్వహించారు.
కృష్ణుడి జన్మదినాన్ని పురస్కరించుకుని విద్యార్థులు కృష్ణుడు, గోపికల వేషధారణలో ముస్తాబై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. చిన్నారులు సంప్రదాయ దుస్తుల్లో అలంకరించుకుని కృష్ణుడి లీలలను ప్రతిబింబించేలా వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేశారు. విద్యార్థుల కేరింతలు, ఆటపాటలతో పాఠశాల.ప్రాంగణం సందడిగా మారింది. ఈ సందర్భంగా కరస్పాండెంట్ అనంతుల జంగయ్యగౌడ్ మాట్లాడుతూ.. పండుగలు, సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంతో పాటు సృజనాత్మకతను పెంపొందిస్తాయని అన్నారు. చిన్నతనం నుంచే మన సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల విశిష్టతను విద్యార్థులకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినీలు వంశీకృష్ణ, పాండు, వెంకటేష్,సంధ్యారాణి,కావ్య, మమత, మాలతి, అమ్రిన్, స్వప్న, మౌనిక, శ్రావణి, రాణి, స్వప్నతో పాటు విద్యార్థినీ, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చెట్టులో విద్యుత్ తీగలు.. మంటలు చెలరేగినా అధికారుల నిర్లక్ష్యం

-ప్రమాదం జరిగేలోపే స్పందించాలంటున్న 7వ వార్డు ప్రజలు



దేవరకద్ర: సెప్టెంబర్ 4 మహాప్రభ
దేవరకద్ర మున్సిపాలిటీ 7వ వార్డులోని మసీదు సమీపంలో చెట్టులో విద్యుత్ తీగలు ఇరుక్కుపోయి ప్రమాదకరంగా మారాయి. గాలి వీచిన సమయంలో తీగలు చెట్టుకు తగలడంతో మంటలు వచ్చినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదం జరిగే అవకాశం ఉన్నందున మున్సిపల్ విద్యుత్ (ఏఈ) అధికారులు వెంటనే స్పందించి విద్యుత్ తీగలను తొలగించే చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజల భద్రత దృష్ట్యా అధికారులు ఇకనైనా నిర్లక్ష్యం వీడి తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు, ప్రజాప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.

చద్మల్ తాండాలో వైభవంగా శివాజీ విగ్రహావిష్కరణ



గాంధారి, సెప్టెంబర్ 4 (మహాప్రభ):
గాంధారి మండలం చద్మల్ తాండా గ్రామంలో హిందూ సామ్రాజ్య స్థాపకుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ భవ్య విగ్రహావిష్కరణ మహోత్సవం శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వీరత్వానికి, ధైర్యానికి, ధర్మ పరిరక్షణకు ప్రతీక అయిన శివాజీ మహారాజ్ స్ఫూర్తితో, హిందూ సమాజ ఐక్యతను చాటుతూ ఈ చారిత్రాత్మక వేడుకను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ శాస్త్రవేత్త, విగ్రహదాత పైడి ఎల్లారెడ్డి ముఖ్య అతిథిగా, ఆవిష్కర్తగా విచ్చేసి విగ్రహావిష్కరణ చేశారు. వారితో పాటు మాజీ ఎమ్మెల్యే నేరెళ్ల ఆంజనేయులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వక్తలుగా అనసూయ రెడ్డి, అంబీర్ మనోహర్ రావు పాల్గొని శివాజీ మహారాజ్ జీవిత చరిత్ర, పోరాట స్ఫూర్తిని వివరించారు.ఈ కార్యక్రమంలో గాంధారి మండల అధ్యక్షుడు మధుసూదన్, మండల నాయకులు సాయిబాబా, శ్రీకాంత్, వివిధ మండలాల అధ్యక్షులు, కార్యకర్తలు, హిందూ రాష్ట్ర సేన సభ్యులు, చద్మల్ తాండా గ్రామ ప్రజలు, శివాజీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కాంగ్రెస్ '1000 రోజుల మోసం'పై బిఆర్ఎస్ సమరభేరి

-మల్లేపల్లిలో ఘనంగా వంటా-వార్పు నిరసన!



దేవరకొండ డివిజన్ సెప్టెంబర్ 4 (మహాప్రభ)
కొండమల్లేపల్లి మండలం కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు, వృద్ధులకు, వికలాంగులకు ఇచ్చిన హామీలను విస్మరించి .1000 రోజుల మోసం చేసిందని నిరసిస్తూ బిఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు మల్లేపల్లి మండల కేంద్రంల వంటా-వార్పు నిరసన కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు.మాజీ ఎమ్మెల్యే రామావత్ రవీంద్ర కుమార్. అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు . నేనావత్ కిషన్ నాయక్. కాంగ్రెస్ పార్టీని ఉద్దేశించి కాంగ్రెస్ పాలనలో ప్రజా సంక్షేమం పూర్తిగా కుదేలైందని, అన్ని వర్గాల ప్రజలను ప్రభుత్వం దారుణంగా మోసం చేసిందని ఆయన విమర్శించారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ 4న మహిళలు, వృద్ధులు మరియు వికలాంగులతో ప్రత్యేక సదస్సు నిర్వహించి, కాంగ్రెస్ వైఫల్యాలను నిలదీసేందుకు బిఆర్ఎస్ పోరుబాటను మరింత తీవ్రతరం చేస్తుందని నాయకులు స్పష్టం చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు, బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

తూప్రాన్ గీతామందిర్ వద్ద ఘనంగా శ్రీకృష్ణ గోకులాష్టమి వేడుకలు

-వెన్న కోసం ఉట్టి కొట్టిన చిన్ని కృష్ణులు
-గోపిక--శ్రీకృష్ణ వేషధారణలతో అలరించిన చిన్నారులు
-భక్తిప్రపత్తులతో మహిళామూర్తుల కోలాటం
-గోపాలకృష్ణుని సేవా శోభాయాత్రతో ఆధ్యాత్మిక శోభ





తూప్రాన్, సెప్టెంబర్ 4,(మహాప్రభ)
శ్రీకృష్ణ జన్మాష్టమి పురస్కరించుకుని తూప్రాన్ పట్టణంలోని గీతా మందిరం వద్ద గోకులాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా, భక్తి ప్రపత్తులతో, ఆధ్యాత్మిక శోభతో ఘనంగా నిర్వహించారు. విద్యుత్ దీపాల కాంతులతో గీతా మందిరం పరిసరాలు దేదీప్యమానంగా వెలిగిపోగా, గోపిక--శ్రీకృష్ణుల వేషధారణలో చిన్నారులు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నారు. చిన్ని కృష్ణులు ఉట్టిని కొట్టి వెన్న కోసం చేసిన సందడి, ఉట్టి కొట్టేందుకు పడిన ముద్దు ముద్దు పాట్లు భక్తులను, ప్రేక్షకులను అలరించాయి. చిన్నారుల కేరింతలు, భక్తి గీతాలు, శ్రీకృష్ణుని నామస్మరణలతో గీతా మందిరం పరిసరాలు గోకుల వాతావరణాన్ని తలపించాయి. గోపికల వేషధారణలో చిన్నారులు, కృష్ణుడి వేషంలో బాలలు చేసిన సందడి వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం గోపాలకృష్ణుని సేవా శోభాయాత్రను తూప్రాన్ పట్టణ పురవీధుల గుండా వైభవంగా నిర్వహించారు. డీజే సౌండ్స్, భక్తి గీతాలు, విద్యుత్ దీపాల అలంకరణల నడుమ సాగిన శోభాయాత్ర భక్తజనులను విశేషంగా ఆకట్టుకుంది. మహిళామూర్తులు భక్తిశ్రద్ధలతో కోలాటం ఆడుతూ శోభాయాత్రలో పాల్గొని పురవీధులను ఆధ్యాత్మిక ఉత్సాహంతో నింపారు.
గీతా మందిరం నుంచి ప్రారంభమైన గోపాలకృష్ణుని శోభాయాత్ర సినిమా టాకీస్ రోడ్డు, ప్రధాన రహదారి, శివాలయం, మున్సిపల్ కార్యాలయం, హైస్కూల్, పాత మార్కెట్, సుభాష్ విగ్రహం, పోలీస్ స్టేషన్, బస్టాండ్, వినాయక నగర్, గాంధీనగర్, బ్రాహ్మణ వీధి, కిందివాడ మీదుగా తిరిగి గీతా మందిరానికి చేరుకుంది. శోభా యాత్రలో మహిళలతోపాటు పురుషులు సైతం సంప్రదాయ తెల్లటి దుస్తులు ధరించి భక్తిశ్రద్ధలతో పాల్గొనడం అందరి దృష్టిని ఆకర్షించింది. తూప్రాన్ పట్టణ పురవీధులన్నీ "గోవిందా... గోవిందా...", "జై శ్రీకృష్ణ" నినాదాలతో మార్మోగగా, ఎక్కడ చూసినా భక్తి పరవశం వెల్లివిరిసింది. చిన్నారుల అమాయకమైన కృష్ణ వేషాలు, గోపికల సందడి, మహిళామూర్తుల కోలాటాలు, విద్యుత్ కాంతుల అలంకరణలతో తూప్రాన్ పట్టణం మొత్తం ఆధ్యాత్మిక వాతావరణంలో మునిగిపోయింది. ఈ కార్యక్రమంలో నేతి నగేష్ గుప్త, కోవూరు శ్రీనివాస్ గుప్త, బుక్క అశోక్, పల్లెర్ల బాలేష్ గుప్త, నేతి బాల వీరయ్య గుప్త, ఆంజనేయులు గుప్త, మంజు బేకరీ లక్ష్మణ్ గౌడ్, గోవర్ధన్ రెడ్డి, లయన్ డాక్టర్ సి.ఆర్. జానకిరామ్ గౌడ్ తో పాటు పలువురు భక్తులు, మహిళామూర్తులు, యువకులు, చిన్నారులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.
భక్తి, భజనలు, కోలాటాలు, చిన్నారుల కృష్ణ వేషధారణలు, గోపాలకృష్ణుని సేవా శోభాయాత్రతో తూప్రాన్ పట్టణంలో శ్రీకృష్ణ గోకులాష్టమి వేడుకలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.

బిజినెస్

భారీగా పెరిగిన బంగారం ధరలు

శ్రీకృష్ణాష్టమి వేళ పసిడి ధరలకు రెక్కలు.. రెండో రోజూ భారీ పెరుగుదల



బులియన్ మార్కెట్‌లో బంగారం ధరలు మరోసారి భారీగా పెరిగాయి. శ్రీకృష్ణాష్టమి రోజున పసిడి ధరలు వినియోగదారులకు షాకిచ్చాయి. వరుసగా రెండో రోజు కూడా బంగారం ధరలు గణనీయంగా పెరగడంతో కొనుగోలుదారులు ఆందోళన చెందుతున్నారు. 22 క్యారెట్లకు చెందిన 10 గ్రాముల బంగారం ధర రూ.1,200 పెరిగి రూ.1,43,600కు చేరింది. అదే సమయంలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,310 పెరిగి రూ.1,56,660కు చేరుకుంది. దీంతో పసిడి ధరలు మరోసారి రికార్డు స్థాయిల వైపు కదులుతున్నాయి. ఇక వెండి ధర కూడా స్వల్పంగా పెరిగింది. కిలో వెండి ధరపై రూ.100 పెరగడంతో రూ.2,55,100కు చేరింది. తెలుగు రాష్ట్రాల్లోనూ ఇదే ధరలు కొనసాగనున్నాయి. వరుసగా బంగారం ధరలు పెరుగుతుండటంతో శుభకార్యాలు, పండుగల సందర్భంగా కొనుగోళ్లు చేయాలనుకునే వారిపై అదనపు భారం పడుతోంది.

లాభాల్లో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు

-362 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్.. 23,897 వద్ద ముగిసిన నిఫ్టీ



ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు శుక్రవారం లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న సానుకూల పరిస్థితులు, కీలక షేర్లలో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు లాభాలను నమోదు చేశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 362.57 పాయింట్లు పెరిగి 76,515.43 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 24.25 పాయింట్లు లాభపడి 23,897.70 వద్ద ముగిసింది. మార్కెట్‌లో రిలయన్స్ ఇండస్ట్రీస్, టాటా స్టీల్, బజాజ్ ఫైనాన్స్ వంటి ప్రముఖ కంపెనీల షేర్లు లాభాల్లో ముగిశాయి. దీంతో సూచీలు రోజంతా కొంత సానుకూలంగా కదలాడాయి. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్లతో పాటు ఆసియా మార్కెట్లలోనూ లాభాల వాతావరణం కనిపించడం దేశీయ మార్కెట్లకు కలిసొచ్చింది. ఇక అంతర్జాతీయ కమోడిటీ మార్కెట్‌లో బంగారం ఔన్స్ ధర 4,472 డాలర్లుగా కొనసాగుతోంది. క్రూడాయిల్ ధర 95.52 డాలర్ల వద్ద ఉంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 94.49 వద్ద కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్ల కదలికలు, రూపాయి మారకం విలువ, ముడిచమురు ధరలు రానున్న రోజుల్లో దేశీయ స్టాక్ మార్కెట్లపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

ట్రావెల్ రంగంలోకి స్విగ్గీ ఎంట్రీ

'క్రూ' పేరుతో ప్రీమియం ట్రావెల్ కాన్సియర్జ్ సేవలు ప్రారంభం



ఫుడ్ డెలివరీ రంగంలో ప్రముఖ సంస్థగా ఉన్న స్విగ్గీ తాజాగా ట్రావెల్ రంగంలోకి అడుగుపెట్టింది. 'క్రూ' పేరుతో ప్రీమియం ట్రావెల్ కాన్సియర్జ్ సేవలను గురువారం ప్రారంభించింది. ప్రయాణికులకు ప్రత్యేకమైన, వ్యక్తిగతీకరించిన ట్రావెల్ సేవలను అందించడమే లక్ష్యంగా ఈ కొత్త సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రస్తుతం 'క్రూ' సేవలు పరిమిత వినియోగదారులకు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. పెయిడ్ మెంబర్లు, సంస్థ నుంచి ఆహ్వానం పొందిన ప్రయాణికులు క్రూ యాప్ ద్వారా ఈ సేవలను వినియోగించుకోవచ్చు. ప్రయాణ ప్రణాళికలు, ప్రత్యేక ఏర్పాట్లు, ఇతర ట్రావెల్ సంబంధిత అవసరాల్లో వ్యక్తిగత సహాయాన్ని అందించేలా ఈ సేవలను రూపొందించినట్లు సంస్థ తెలిపింది. గత ఏడాది వ్యక్తిగత కాన్సియర్జ్ సేవగా 'క్రూ'ను స్విగ్గీ ప్రారంభించింది. వినియోగదారుల నుంచి ఈ సేవకు మంచి స్పందన, బలమైన డిమాండ్ రావడంతో తాజాగా దీన్ని విస్తరించి ట్రావెల్ రంగంలోకి ప్రవేశించినట్లు తెలుస్తోంది. ఫుడ్ డెలివరీతో పాటు వివిధ సేవల విభాగాల్లో తన కార్యకలాపాలను విస్తరిస్తున్న స్విగ్గీకి 'క్రూ' ఎంట్రీ మరో కీలక అడుగుగా మారింది.

సెమీస్‌లో సాత్విక్ జోడీ .. క్వార్టర్స్‌లోనే కంగుతిన్న శ్రీకాంత్..!



చైనా మాస్టర్స్ 2026లో భారత డబుల్స్ ద్వయం అదరగొట్టింది. పురుషుల క్వార్టర్ ఫైనల్లో అద్భుతంగా ఆడిన సాత్విక్ సాయిరాజ్ -- చిరాగ్ శెట్టి జోడీ సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. హోరాహోరీగా సాగిన మూడ సెట్ల పోరులో అస్ట్రుప్ -- రస్ముసెన్(డెన్మార్క్) జంటను చిత్తు చేసింది సాత్విక్ జోడీ. అయితే.. పురుషుల సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్(ఖఱఝుఎఎఱ ూతీఱఝుఱ్ఫ్ర) పోరాటం ముగిసింది. అదిరే ఆటతో క్వార్టర్ ఫైనల్ చేరిన అతడు లీ చీక్ యూ(హాంకాంగ్) చేతిలో వరస సెట్లలో వెనకబడి.. ఓటమి పాలయ్యాడు.బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్ 750 ఈవెంట్‌లో భారత డబుల్స్ ద్వయం సెమీస్‌లో అడుగుపెట్టింది. శుక్రవారం ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో తొలి సెట్‌ను 21-13తో గెలిచిన సాత్విక్ సాయిరాజ్ -- చిరాగ్ శెట్టి జంట.. ఆపైనా మరింత చెలరేగింది. అస్ట్రుప్ -- రాస్ముస్సెన్ జంట 16-21తో రెండో సెట్ గెలిచి మ్యాచ్‌ను మూడో సెట్‌కు తీసుకెళ్లింది. నిర్ణయాత్మక సెట్‌లో పంజా విసిరిన భారత ద్వయం 21-18తో మట్టికరిపించింది. డెబ్బై నిమిషాల పోరులో ప్రత్యర్థిని గొప్పగా నిలువరించిన సాత్విక్ జోడీ సెమీస్ బెర్తు దక్కించుకుంది.

పట్టు సడలించి..

ఇదే ఈవెంట్‌లో పతకంపై ఆశలు రేపిన కిడాంబి శ్రీకాంత్ మాత్రం క్వార్టర్స్‌లో కంగుతిన్నాడు. శుక్రవారం మ్యాచ్ ఆరంభంలో లీ చెక్ యూపై చకచకా రెండు పాయింట్లు సాధించిన అతడు.. ఆపై ఆదే జోరు చూపలేకపోయాడు. అనూహ్యంగా పుంజుకున్న హాంకాంగ్ ప్లేయర్ అద్భుతంగా భారత షట్లర్‌ను నిలువరించాడు. తొలి సెట్‌ను 21-16తో గెలుచుకున్న లీకి.. రెండో సెట్‌లో శ్రీకాంత్ షాకిస్తూ వరసగా నాలుగు పాయింట్లు సాధించాడు. కానీ, కాసేపటికే ఆధిక్యాన్ని తగ్గించినా.. భారత ఆటగాడు 15-14తో సెట్ సొంతం చేసుకుంటాడనిపించింది.కానీ, పట్టువదలని లీ.. 21-16తో సెట్‌నూ, మ్యాచ్‌ను గెలుచుకున్నాడు. దాంతో, శ్రీకాంత్ వరసగా అతడి చేతిలో నాలోగో ఓటమి చవిచూశాడు. చివరగా 2018 ఇండియా ఓపెన్‌లో లీపై విజయం సాధించాడీ మాజీ వరల్డ్ నంబర్ 1. హాంకాంగ్ షట్లర్ చేతిలో భారత సీనియర్‌కు ఇది వరసగా నాలుగో పరాజయం. మ్యాచ్ పోయినా కాసింత గర్వపడాల్సిన విషయం ఏంటంటే.. గత మూడేళ్లలో ఒక బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్ 750 ఈవెంట్‌లో శ్రీకాంత్ క్వార్టర్స్ ఆడడం ఇదే మొదటిసారి.

ఈస్ట్ జోన్‌తో ఫైనల్.. తిలక్ వర్మ బృందంలో సిరాజ్, పడిక్కల్..!



దేశవాళీ సీజన్ 2025-26 తొలి ట్రోఫీ అయిన దులీప్ ట్రోఫీ ఫైనల్లో భారత స్టార్లు ఆడనున్నారు. శ్రీలంక పర్యటన ముగియడంతో పేసర్ సిరాజ్ , యువ బ్యాటర్ దేవ్‌దత్ పడిక్కల్ ఈ టోర్నీలో బరిలోకి దిగనున్నారు. లంకపై మెరిసిన వీరిద్దరూ సౌత్ జోన్ జట్టు తరఫున చెలరేగనున్నారు. సెప్టెంబర్ 6 ఆదివారం బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ లో ఈస్ట్ జోన్‌తో ఫైనల్ జరుగనుంది.దులీప్ ట్రోఫీ ఫైనల్‌కు ముందే సౌత్ జోన్ జట్టు మరింత పటిష్టంగా మారనుంది. సెమీస్‌లో నార్త్ జోన్‌పై సూపర్ విక్టరీ కొట్టిన సౌత్ బలాన్ని పెంచుతూ.. శ్రీలంకపై సెంచరీలతో చెలరేగిన దేవ్‌దత్ పడిక్కల్, ప్రధాన పేసర్ సిరాజ్‌లు జట్టుతో కలువనున్నారు. శ్రీలంకపై మూడు ఇన్నింగ్స్‌ల్లో పడిక్కల్ రెండు సెంచరీలతో 328 రన్స్ సాధించగా.. సిరాజ్ మాత్రం నాలుగే వికెట్లతో నిరాశపరిచిన విషయం తెలిసిందే.ఇప్పటికే కేఎల్ రాహుల్ కూడా స్క్వాడ్‌లో చేరడంతో.. తిలక్ వర్మ కెప్టెన్సీలోని ఆ టీమ్ ఆత్మవిశ్వాసం రెట్టింపు కానుంది. ఇషాన్ కిషన్ సారథ్యంలోని ఈస్ట్ జోన్ సెమీఫైనల్లో సెంట్రల్ జోన్‌ను చిత్తు చేసి ఫైనల్లో అడుగుపెట్టింది. మరో సెమీస్‌లో నార్త్‌పై 7 వికెట్ల విజయంతో టైటిల్ పోరుకు సిద్ధమైంది సౌత్. సెప్టెంబర్ 6 ఆదివారం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఇరు జట్లు అంతిమపోరులో అమీతుమీ తేల్చుకోనున్నాయి.

సౌత్ జోన్ స్క్వాడ్(అప్డేటెడ్)

కేఎల్ రాహుల్, దేవ్‌దత్ పడిక్కల్, కరుణ్ నాయర్, తిలక్ వర్మ(కెప్టెన్), రికీ భూ(వైస్ కెప్టెన్), నారాయణ్ జగదీశన్, కొడమెల హిమతేజ, షేక్ రషీద్, రవిచంద్రన్ స్మరణ్, అభినవ్ తెజ్రన, సిరాజ్, సీవీ మిలింద్, అమన్ ఖాన్, శ్రేయాస్ గోపాల్, కావూరి సాయితేజ, తనయ్ త్యాగరాజన్, త్రిపురణ విజయ్.

స్పోర్ట్స్

వరల్డ్‌కప్ విజేతపై రెండేళ్ల నిషేధం.. 62 మందిపై బీసీసీఐ చర్యలు..!



దేశవాళీ క్రికెట్‌లో మెరుస్తున్న యువ క్రికెటర్లకు భారత క్రికెట్ నియంత్రణ మండలి బిగ్ షాకిచ్చింది. అండర్-19 వరల్డ్‌కప్ విజేత రవి కుమార్ , అండర్19 స్క్వాడ్‌లోని రోహిత్ యాదవ్ లపై నిషేధం విధించింది. వయసు పరమైన నేరానికి పాల్పడినందున వీరిద్దరిని రెండేళ్లు సస్పెండ్ చేసింది బీసీసీఐ. రోహిత్ యాదవ్‌పై రెండేళ్లు నిషేధం విధించాం. మరో 62మందిని కూడా రెండేళ్ల కాలానికి సస్పెండ్ చేశాం అని శుక్రవారం బీసీసీఐ వర్గాలు తెలిపాయి.భారత అండర్-19 స్క్వాడ్‌లోని రోహిత్ యాదవ్‌పై రెండేళ్ల నిషేధం విధించింది బీసీసీఐ. ఇటీవలే శ్రీలంకపై రాణించి.. ఆస్ట్రేలియా పర్యటనకు ఎంపికైన ఈ లెగ్ స్పిన్నర్‌కు ఇది ఊహించని షాక్. అలానే 2022లో అండర్-19 వరల్డ్‌కప్ గెలుపొందిన భారత జట్టులోని సభ్యుడు రవి కుమార్ కూడా వేటుకు గురయ్యాడు. ఉత్తరప్రదేశ్‌కు చెదిన రోహిత్ జట్టులో చోటు కోసం తన వయసును కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేశాడు. ఈ విషయాన్ని పసిగట్టిన బీసీసీఐ విచారణ చేపట్టింది. శ్రీలంక పర్యటన సమయంలో అతడు సమర్పించిన వయసు ధ్రువీకరణ పత్రాల్లో పుట్టిన సంవత్సరం వేర్వేరుగా ఉంది.ఆధార్‌లో ఒకలా.. ఒకదాంట్లో రోహిత్ 2007లో జన్మించినట్టు ఉండగా.. ఆధార్ కార్డులో మాత్రం 2009లో రోహిత్ పుట్టినట్టు ఉంది. ఇదివరకే ఈ విషయం తెలిసిన బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ రోహిత్‌ను జూనియ్ స్థాయిలో ఆడనివ్వలేదు. ఇప్పుడు బీసీసీఐ కూడా అతడి పుట్టిన సంవత్సరంలో తేడాలు ఉండడాన్ని తీవ్రంగా పరిగణించింది. అతడు తన వయసును దాచేందుకు ప్రయత్నించాడని నిర్ధారించుకున్న భారత బోర్డు రెండేళ్లు సస్పెండ్ చేసింది. అతడితో పాటు వయసు సంబంధిత ధ్రువపత్రాలు సరిగ్గా లేని 62 మందిపై వేటు వేసింది బీసీసీఐ. అంతేకాద.. ఎడమ చేతివాటం స్పిన్నర్ విషాల్ భాట్టి సైతం ఈ లిస్ట్‌లో ఉన్నాడు. ఈ అరవై రెండు మందిని 2026-27, 2027-28 దేశవాళీ సీజన్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవదద్దని బీసీసీఐ తెలిపింది.

తొలిసారి 'హారర్ కామెడీ' బాటలో మాస్ మహారాజా

బాక్సాఫీస్ వద్ద రికార్డుల వేట మొదలైతే ఎలా ఉంటుందో మాస్ మహారాజా రవితేజ మరోసారి నిరూపించారు. ఇటీవల విడుదలైన 'ఇరుముడి' చిత్రం ఘనవిజయం సాధించి థియేటర్లలో కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటూ ఈ చిత్రం తాజాగా రూ. 200 కోట్ల క్లబ్‌లోకి అడుగుపెట్టింది. ఈ బ్లాక్‌బస్టర్ విజయాన్ని పురస్కరించుకుని చిత్ర బృందం విడుదల చేసిన ప్రత్యేక పోస్టర్ సైతం అభిమానులను విశేషంగా ఆకర్షిస్తోంది. సినిమా ఆరంభంలో బేబీ నక్షత్ర, రవితేజ, ప్రియా భవానీ శంకర్‌లపై చిత్రీకరించిన అన్‌సీన్ స్టిల్‌ను చిత్ర దర్శకుడు శివ నిర్వాణ పంచుకుంటూ సక్సెస్ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ చారిత్రాత్మక విజయంతో ఫుల్ జోష్‌లో ఉన్న రవితేజ, తన భవిష్యత్ ప్రాజెక్టుల విషయంలో వేగాన్ని పెంచడమే కాకుండా ప్రేక్షకులను ఆశ్చర్యపరిచే సరికొత్త పంథాను ఎంచుకుంటున్నారు. ఎప్పుడూ రొటీన్ మాస్, కమర్షియల్ ఫార్ములాకే పరిమితం కాకుండా, కెరీర్‌లోనే మునుపెన్నడూ చేయని వినూత్న ప్రయోగాలకు శ్రీకారం చుడుతున్నారు. ఈ సరికొత్త ప్రయాణంలో భాగంగా టాలీవుడ్‌లో వైవిధ్యమైన దర్శకుడిగా పేరు తెచ్చుకున్న వివేక్ ఆత్రేయతో రవితేజ చేతులు కలిపారు. 'సరిపోదా శనివారం' వంటి విజయవంతమైన చిత్రం తర్వాత వివేక్ ఆత్రేయ సిద్ధం చేసిన కథ రవితేజను అమితంగా ఆకట్టుకుంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా రవితేజ తన సుదీర్ఘ సినీ ప్రస్థానంలో ఎన్నడూ టచ్ చేయని 'హారర్ కామెడీ' జోనర్‌లోకి తొలిసారిగా అడుగుపెడుతుండటం సినీ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. సాధారణంగా మాస్ యాక్షన్, ఫ్యామిలీ డ్రామా, క్రైమ్ థ్రిల్లర్లతో పాటు పక్కా ఎంటర్‌టైనర్లలో రవితేజ తన మార్క్ చూపించారు. అయితే ప్రేక్షకులను భయపెడుతూనే కడుపుబ్బా నవ్వించే హారర్ కామెడీ తరహా పాత్రను ఆయన ఇంతవరకు చేయలేదు. వివేక్ ఆత్రేయ మార్క్ విలక్షణమైన స్క్రీన్‌ప్లే, రవితేజ అసమానమైన ఎనర్జీ, టైమింగ్ తోడైతే వెండితెరపై నవ్వుల విందు గ్యారెంటీ అని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. లక్ష్మణ్, శ్రీని సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనుల్లో ఉంది. వివేక్ ఆత్రేయ చిత్రంతో పాటే మరో క్రేజీ ప్రాజెక్ట్‌ను కూడా రవితేజ ఖరారు చేశారు. 'రాజ రాజ చోర', 'స్వాగ్' వంటి చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యువ దర్శకుడు హసిత్ గోలి దర్శకత్వంలో ఓ అవుట్ అండ్ అవుట్ కామెడీ ఎంటర్‌టైనర్ తెరకెక్కనుంది. ప్రముఖ నిర్మాత దిల్ రాజు (శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్) నిర్మిస్తున్న ఈ చిత్రంలో టాలెంటెడ్ హీరో శ్రీవిష్ణు మరో ప్రధాన పాత్రలో సందడి చేయనున్నారు. రవితేజ మార్క్ జోష్‌కు శ్రీవిష్ణు పంచ్‌లు జతకలిస్తే వినోదం ఏ స్థాయిలో ఉంటుందో ఊహించుకోవచ్చు. ఈ మల్టీస్టారర్ చిత్రాన్ని 2027 సంక్రాంతి పండుగ కానుకగా థియేటర్లలోకి తీసుకురానున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది. మొత్తానికి హసిత్ గోలి సినిమా పూర్తి కాగానే వివేక్ ఆత్రేయ హారర్ కామెడీ సెట్స్‌పైకి వెళ్లనుంది.



సంక్రాంతి రేసులో 'కాకా'.. హైదరాబాద్‌లో భారీ షెడ్యూల్!



టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద మరోసారి రికార్డులను తిరగరాసేందుకు మెగాస్టార్ చిరంజీవి, మాస్ డైరెక్టర్ బాబీ (కె.ఎస్. రవీంద్ర) మరో అడుగు ముందుకు వేస్తున్నారు. వీరిద్దరి కలయికలో ఇప్పటికే వచ్చిన బ్లాక్‌బస్టర్ చిత్రం 'వాల్తేరు వీరయ్య' సంచలన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ క్రేజీ కాంబోలో తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'కాకా' సినిమాకు సంబంధించిన కీలకమైన షూటింగ్ అప్‌డేట్‌ను చిత్రబృందం వెల్లడించింది.ఈ భారీ ప్రాజెక్ట్‌కి సంబంధించిన తదుపరి కీలక షెడ్యూల్ సెప్టెంబర్ 7వ తేదీ నుంచి హైదరాబాద్ వేదికగా ప్రారంభం కానుంది. ఈ తాజా షెడ్యూల్‌లో సినిమాలోని కొన్ని ముఖ్యమైన సన్నివేశాలతో పాటు హై-వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్‌లను తెరకెక్కించడానికి దర్శకుడు బాబీ ప్లాన్ చేసినట్లు సమాచారం. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మాత వెంకట్ నారాయణ అత్యంత భారీ బడ్జెట్‌తో, ఎక్కడా రాజీ పడకుండా నిర్మిస్తున్నారు. నిర్మాణానంతర కార్యక్రమాలు మరియు షూటింగ్‌ను శరవేగంగా పూర్తి చేస్తున్న మేకర్స్, ఈ సినిమాను 2027 సంక్రాంతి కానుకగా జనవరి 13న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. మెగాస్టార్ చిరంజీవి కొత్త లుక్‌లో కనిపించబోతున్న ఈ చిత్రంలో ఆయనతో పాటు నటి అనస్వర రాజన్, నివేతా పేతురాజ్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.





గాయం కూడా మంచికే!

'ఒక్కోసారి చెడు కూడా మంచే చేస్తుంది. 'మైసా' షూట్‌లో తగిలిన గాయం ఓ విధంగా నాకు మంచే చేసింది' అంటూ ఆనందం వెలిబుచ్చారు అగ్ర కథానాయిక రష్మిక మందన్నా. తాజాగా తన గాయం గురించి రష్మిక మాట్లాడుతూ 'పెళ్లయితే అయ్యిందికానీ.. సినిమా కమిట్‌మెంట్ల కారణంగా కలిసి ఉండే సమయం మాత్రం మాకు కరువైంది. పెళ్లి జరిగాక మూడునెలల పాటు మేమిద్దరం ఒకరినొకరం చూసుకోలేదంటే నమ్ముతారా!? కేవలం ఫోన్లలోనే మాట్లాడుకునేవాళ్లం. మా అవస్థ చూసి విధికి కూడా బాధ కలిగినట్టుంది. దాంతో నాకు విశ్రాంతి ఇద్దామని ఫిక్స్ అయ్యింది. అందుకే ఈ గాయమైంది కావొచ్చు. వినడానికి వింతగా అనిపించినా.. ఈ సమయం మాత్రం నాకు చాలా నచ్చింది.ఈ నెలరోజులూ ఇద్దరం ఇంట్లోనే హాయిగా గడిపాం. 'ఎలాంటి గాయాలూ లేకుండా మనం ఇలా ఎన్నో రోజులు గడపాలి' అని విజయ్ అనేవాడు. తను ఆటపట్టిస్తుంటే నాకెంతో ఆనందంగా ఉండేది. ఈ విశ్రాంతి రోజులన్నీ నాకు అద్భుతమైన జ్ఞాపకాలుగా నిలిచిపోయాయి. నాకు కొరియన్ డ్రామాలంటే పిచ్చి. విజయ్‌కేమో సీరియస్ డ్రామాలు, షోలు ఇష్టం. ఈ ఖాళీ టైమ్‌లో ఇద్దరం కలిసి రెండూ కవర్ చేశాం' అంటూ సరదాగా చెప్పుకొచ్చారు రష్మిక. ఇదిలావుంటే.. గాయం నుంచి కోలుకున్న రష్మిక తిరిగి మళ్లీ షూటింగ్స్‌తో బిజీ కానున్నారు. ఇప్పటికే ముగింపు దశలో ఉన్న 'మైసా' చిత్రాన్ని ఆమె పూర్తి చేయనున్నారు. నవంబర్ 27న పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమా విడుదల కానున్నది. ఇక తన భర్త విజయ్ దేవరకొండతో కలిసి ఆమె నటిస్తున్న 'రణబాలి' అక్టోబర్ 16న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానున్న విషయం తెలిసిందే

కమల్‌హాసన్ కొత్త సినిమా



గత ఏడాది విడుదలైన 'థగ్ లైఫ్' తర్వాత అగ్ర నటుడు కమల్‌హాసన్ కొత్త సినిమా పట్టాలెక్కలేదు. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో రజనీకాంత్‌తో కలిసి ఓ మల్టీస్టారర్ సినిమా ప్రకట జరిగింది. దాంతో పాటు స్టంట్ మాస్టర్ అన్బరివ్ దర్శకత్వంలో కూడా కమల్‌హాసన్ ఓ సినిమాకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. అయితే ఇప్పటివరకు ఈ రెండు చిత్రాలు ప్రకటనల వరకే పరిమితమై పోయాయి. ఈ నేపథ్యంలో అభిమానుల్ని సర్‌ప్రైజ్ చేస్తూ ఎస్.యు.అరుణ్‌కుమార్ దర్శకత్వంలో కొత్త చిత్రానికి శ్రీకారం చుట్టారు కమల్‌హాసన్. గురువారం కమల్‌హాసన్ లుక్ టెస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేశారు.ఇందులో ఆయన సాల్ట్ అండ్ పెప్పర్ లుక్‌లో చేతిలో ఆయుధాన్ని ధరించి పవర్‌ఫుల్‌గా కనిపిస్తున్నారు. యాక్షన్ ప్రధానంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారని ఫస్ట్‌లుక్‌ని చూస్తే అర్థమవుతున్నది. 'సేతుపతి' 'చిత్తా' చిత్రాలతో తమిళంలో మంచి గుర్తింపును సంపాదించుకున్నాడు దర్శకుడు ఎస్.యు.అరుణ్‌కుమార్. తాజాగా ఆయన కమల్‌హాసన్‌ను డైరెక్ట్ చేయడం తమిళ సినీ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. ఈ సినిమా షూటింగ్ త్వరలో ప్రారంభమవుతుందని మేకర్స్ తెలిపారు. రాజ్‌కమల్‌ఫిల్మ్ ఇంటర్నేషనల్, టర్మరిక్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్ పతాకాలపై కమల్‌హాసన్, ఆర్.మహేంద్రన్ ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com